# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :219 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: శుక్రవారం 07-11-2025 పేజీలు:4 వెల: 2.00


## వ్యక్తిని కిరాతకంగా హత్య చేసిన నలుగురు

హైదరాబాద్, బట్టలపై చట్నీ పడిందనే చిన్న కారణంతో ఒక వ్యక్తిని నలుగురు యువకులు అతి కిరాతకంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్ కల్యాణపురి నివాసి మురళీ కృష్ణ(45) సోమవారం నాడు పని మీద ఎల్బీనగర్ వెళ్లాడు. అనంతరం రాత్రి ఇంటికి వెళ్లేందుకు కారులో వెళ్లున్న వారిని లిఫ్ట్ అడిగాడు. ఆ కారులో నలుగురు యువకులు ఉన్నారు. అయితే, మార్గం మధ్యలో వారికి ఆకలి వేయడంతో ఉప్పల్‌లోని ఓ టిఫిన్ సెంటర్ దగ్గర వారంతా టిఫిన్ చేయడానికి ఆగారు. అయితే, అక్కడ అనుకోకుండా మురళీ కృష్ణ ప్లేట్‌లోని చట్నీ ఒక యువకుడిపై పడింది. దీంతో ఆ యువకులు మురళీ కృష్ణతో గొడవకు దిగారు. బలవంతంగా అతడిని కారులోకి ఎక్కించుకుని సుమారు రెండు గంటలపాటు కారులోనే తిప్పుతూ చిత్ర హింసలకు గురి చేశారు.అంతేకాకుండా, నాచారం సమీపంలోని ఒక నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కత్తితో అతడిని విచక్షణారహితంగా పొడిచారు. నిందితుల నుంచి తప్పించుకునేందుకు మురళీ కృష్ణ ప్రయత్నించి చివరికి తన ప్రాణాలు కోల్పోయాడు.

## ఎన్టీఆర్ విగ్రహం పేరిట రేవంత్ రెడ్డి హడావుడి




హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రావడంతోనే ఎన్టీఆర్ విగ్రహం పేరిట సీఎం రేవంత్ రెడ్డి హడావుడి చేస్తున్నాడని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మండిపడ్డారు. ఇవాళ మాజీ ఎంపీ నామా నాగేశ్వర్ రావుతో కలిసి పువ్వాడ అజయ్ మీడియాతో మాట్లాడారు.ఎన్టీఆర్ పట్ల మాగంటి గోపినాథ్ ఎంత విశ్వాసంగా ఉన్నారో.. కేసీఆర్ పట్ల అంత కంటే ఎక్కువగా ఉన్నారు. తనను పార్టీ మారమని ఒత్తిడి తెచ్చారని అయినా చివరివరకు కేసీఆర్‌తోనే ఉంటానని వారికి చెప్పానని గోపినాథ్ అన్నారు. గోపినాథ్ చనిపోయినపుడు కేసీఆర్ తన సొంత కుటుంబ సభ్యుడు కోల్పోతే ఎంత భాధపడుతారో అంత భాధ పడ్డారు. మాగంటి సునీత కన్నీళ్లను కూడా మంత్రులు వెటకారం చేసేలా మాట్లాడడాన్ని ప్రపంచం అంతా చూసింది. ఒక ఆడబిడ్డపై అంత నీచంగా మాట్లాడడం తగదు అని పువ్వాడ అజయ్ పేర్కొన్నారు.అన్ని వర్గాలకు గుర్తింపు ఇచ్చినట్లే కమ్మ సామాజికవర్గానికి కూడా కేసీఆర్ మంచి గుర్తింపు ఇచ్చారు. రాజకీయంగా, అన్ని రంగాల్లోనూ అవకాశాలు చాలా ఇచ్చి ప్రోత్సహించారు. సినీ నటుడు కృష్ణ చనిపోతే అధికార లాంఛనాలతో అంత్యక్రియలు చేయాలని చెప్పిన మహనీయుడు కేసీఆర్. ఇవాళ ఎన్నిక వచ్చిందని ఎన్టీఆర్ విగ్రహం పేరిట సీఎం రేవంత్ హడావుడి చేస్తున్నారు అని మాజీ మంత్రి పువ్వాడ ధ్వజమెత్తారు.

## రైల్లో ప్రయాణికుడిపై కర్రలతో దాడి చేసిన క్యాటరింగ్ సిబ్బంది..

ఉత్తరప్రదేశ్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. రైల్లో ఓ ప్రయాణికుడిపై కొందరు కర్రలతో దాడి చేశారు . ఈ ఘటన ఝాన్సీ లో చోటు చేసుకుంది. నిహాల్ అనే వ్యక్తి ఇటీవలే తన కుటుంబంతో కలిసి కత్రా నుండి బినాకు అండమాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించాడు. ఈ క్రమంలో రైల్లో భోజనం తీసుకున్నాడు. అయితే, రూ.110గా ఉన్న వెజ్ మీల్స్ కు రూ.130 వసూలు చేయడంపై నిహాల్ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ధర చాలా ఎక్కువ అని క్యాటరింగ్ సిబ్బందితో వాదించాడు. ఆగ్రహించిన సిబ్బంది నిహాల్‌పై దాడికి ప్రయత్నించారు. కొంతమంది కర్రలు, బెల్టులతో తీవ్రంగా కొట్టారు. తోటి ప్రయాణికులు జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించినా వారు వినలేదు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



## ఏపీలో మరో బస్సు దగ్ధం.. ప్రయాణికులు సురక్షితం

అమరావతి : కర్నూలు జిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం ఘటనను మరచిపోక ముందే ఆంధ్రప్రదేశ్( లో మరో బస్సు దహనం ఘటన సంచలనంగా మారింది. అయితే ప్రయాణికులు సురక్షితంగా ఉండడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.

గురువారం విశాఖపట్నంనుంచి పార్వతీపురం జయపురకు వెళ్తున్న ఒడిశా ఆర్టీసీ బస్సు మన్యం జిల్లా పాచిపెంట మండలం రొడ్డవలస వద్ద ఆంధ్ర – ఒడిస్సా ఘాట్ రోడ్డులో ఆకస్మత్తుగా బస్సులో నుంచి పొగలు ప్రారంభమయ్యాయి. గమనించిన డ్రైవర్ అప్రమత్తమై బస్సును నిలిపివేసి ప్రయాణికులను దించివేశారు. దీంతో ప్రయాణికులకు ప్రాణనష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

బస్సు ప్రమాదంపై మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి జిల్లా అధికారులను అడిగి తెలుసుఉన్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని




మంత్రులకు అధికారులు వివరించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు. ఆర్టీసీ డ్రైవర్లకు ప్రత్యేకంగా అవగాహన శిబిరాలు నిర్వహించాలన్నారు.

## పాక్, చైనాను వణికించిన భూకంపం.. అఫ్ఘాన్‌లోనూ ప్రకంపనలు

దాయాది పాకిస్థాన్ , చైనా దేశాలను భూకంపం వణికించింది. గురువారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో పాక్‌లో భూమి కంపించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.3గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భూమికి 240 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రాన్ని గుర్తించారు. అయితే, ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. పాక్‌లో ఇటీవలే వరుస భూ ప్రకంపనలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే.

%మరోవైపు చైనాలోనూ భూకంపం సంభవించింది. వాయువ్య చైనాలోని జిన్జియాంగ్‌లో ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.7గా నమోదైనట్లు ఎన్‌సీఎస్ తెలిపింది. 220 కి.మీ లోతులో భూకంపం సంభవించినట్లు పేర్కొంది. తాలిబన్ల ఆధీనంలోని అఫ్ఘానిస్థాన్ లో మరోసారి భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 4.4గా నమోదైంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది.



అయితే, ప్రకంపనలు స్వల్ప స్థాయిలోనే ఉండటంతో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదు. కాగా, అఫ్ఘాన్‌లో భూకంపం సంభవించడం మూడు రోజుల్లో ఇది రెండోసారి. నవంబర్ 3వ తేదీన 6.3 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. ఈ విపత్తులో 20 మందికిపైగా మృతి చెందగా, 300 మందికిపైగా గాయాలపాలయ్యారు. దాన్నుంచి కోలుకోకముందే మరోసారి ప్రకంపనలు రావడంతో అఫ్ఘాన్ ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

## ఓటు హక్కు వినియోగించుకున్న బీహార్ సీఎం నితీశ్ కుమార్

బీహార్ లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగుతున్నది. ఉదయం నుంచే ఓటర్‌లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పలువురు ప్రముఖులు కూడా తమతమ పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేస్తున్నారు. ఇప్పటికే లాలూ ప్రసాద్ యాదవ్ తన కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు.

%తాజాగా బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ యాదవ్ కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బక్తియార్‌పూర్‌లోని పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. బీహార్‌లో మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో పోలింగ్ నిర్వహిస్తున్నారు. ఇవాళ 121 స్థానాల్లో తొలి విడత పోలింగ్ జరుగుతోంది. ఈ నెల 11న రెండో విడత పోలింగ్ నిర్వహించనున్నారు.



## మరో నలుగురు మావోయిస్టులు మృతి

బీజాపూర్: ఛత్తీస్‌గఢ్‌లోని దండకారణ్యంలో మావోయిస్టులు, పోలీసుల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందారు. బీజాపూర్ జిల్లా తార్లగూడెం పరిధిలోని అన్నారం–మారిమల్ల అడవుల్లో భీకర ఎన్‌కౌంటర్ కొనసాగుతున్నది. బుధవారం ఇదే ప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం ఉదయం జరిగిన కాల్పుల్లో మరో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. %ఆరు నెలలపాటు ఆయుధాలు పట్టేది లేదని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రకటించిన 48 గంటల్లోపే తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో బుధవారం ఎదురుకాల్పుల ఘటన చోటుచేసుకోవడం, రెండు రోజుల వ్యవధిలోనే ఏడుగురు మావోయిస్టులు మృతిచెందడం గమనార్హం.



## ప్రశ్నించిన స్టార్ ప్లేయర్.. ప్రధాని సమాధానం ఇదే..

మహిళల వన్డే వరల్డ్‌కప్ గెలిచిన హర్మన్‌ప్రీత్ నేతృత్వంలోని భారత బృందం బుధవారం ప్రధాని మోదీని ఆయన నివాసంలో కలిసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అమ్మాయిలతో ప్రధాని మోదీ సరదాగా ముచ్చటించారు. ప్రతి ప్లేయర్‌తో సంభాషించి వారి వద్ద నుంచి అనేక విషయాలను రాబట్టారు. ఈ సమావేశంలో ప్రధాని మోదీకి ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. ప్రధానితో సంభాషణ సందర్భంగా టాపార్డర్ బ్యాటర్ హర్లీన్ డియోల్ ఓ ఆసక్తికర ప్రశ్న అడిగింది. 'మీ స్కిన్ ఎప్పుడూ చాలా గ్లోగా కనిపిస్తుంది. మీ స్కిన్‌కేర్ రొటీన్ ఏంటి సర్..?' అని ప్రశ్నించింది. ఈ ప్రశ్నతో అక్కడ నవ్వులు విరబూశాయి. ఇక ఊహించని ఈ ప్రశ్నకు ప్రధాని తొలుత ఆశ్చర్యపోయారు. 'నేను వాటి గురించి అంతగా ఆలోచించను' అంటూ సమాధానమిచ్చారు.



## రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్ : బీఆర్కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని కలిసిన శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, మహ్మద్ షకీల్, బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కిశోర్ గౌడ్, సల్మాన్‌ఖాన్‌తో పాటు ఇతర బీఆర్ఎస్ మైనార్టీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా ముస్లింలపై జరుగుతున్న దాడులు, ముస్లింలపై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల ప్రధానాధికారికి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డిని కోరారు. ముస్లింలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని



డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్ రెడ్డికి వేర్వేరుగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మైనార్టీ నేతలు ఫిర్యాదు చేశారు.

## శాండల్‌వుడ్‌లో విషాదం నెలకొంది.

కన్నడ నటుడు, 'కేజీఎఫ్' ఫేమ్ హరీశ్ రాయ్ కన్నుమూశారు. గత కొంతకాలంగా థైరాయిడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన నేడు తుదిశ్వాస విడిచారు. ఆయన మరణంతో కన్నడ సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. హరీశ్ రాయ్ తన సుదీర్ఘ నట జీవితంలో ఎన్నో సినిమాల్లో తనదైన నటనతో ప్రేక్షకులను మెప్పించారు. 'ఓం' (1995) సినిమాలో డాన్ రాయ్‌గా, 'కేజీఎఫ్' సిరీస్‌లో ఖాసిం చాచా గా ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకులకు చిరకాలం గుర్తుండిపోతాయి.మూడేళ్ల క్రితం ఒక ఇంటర్వ్యూలో హరీశ్ రాయ్ తన అనారోగ్య పరిస్థితిని వెల్లడించారు. ఆర్థిక సాయం చేయాలని ఆయన సినీ ప్రముఖులను కోరగా, పలువురు హీరోలు స్పందించి సహాయం అందించారు. కేజీఎఫ్‌లో హరీశ్ రాయ్ గడ్డం పెంచడానికి కూడా ఒక కారణం ఉంది. ఆ టైంలో అతడు క్యాన్సర్‌తో బాధ పడుతుండగా.. క్యాన్సర్ వలన గొంతు వాచిపోయింది. అది కనపడకుండా ఉండేందుకు గడ్డం పెంచానంటూ ఒక



ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు.

## రూ.60 కోట్ల మోసం కేసు

ఓ వ్యాపారవేత్తను రూ.60 కోట్ల మేరకు మోసం కేసు లో బాలీవుడ్ స్టార్ నటి శిల్పాశెట్టి ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రా నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసును ముంబై పోలీసుల ఆర్థిక నేరాల విభాగం దర్యాప్తు చేస్తోంది. దర్యాప్తులో భాగంగా ఈ కేసు తాజాగా కీలక మలుపు తీసుకుంది.నిధుల మళ్లింపులో నలుగురు కీలక వ్యక్తులను దర్యాప్తు బృందం గుర్తించింది. రాజ్ కుంద్రా కంపెనీ బెస్ట్ డీల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉన్నత స్థాయిలో ఉన్న నలుగురు ఉద్యోగులకు ముంబై పోలీసు ఆర్థిక నేరాల విభాగం సమన్లు పంపింది. వీరిలో ఒకరు ఇప్పటికే దర్యాప్తు బృందం ముందు విచారణకు హాజరైనట్లు తెలిసింది. సదరు ఉద్యోగిని ప్రశ్నించిన అధికారులు స్టేట్‌మెంట్ కూడా రికార్డు చేసినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మిగతా ముగ్గురు ఉద్యోగులు త్వరలోనే విచారణకు హాజరు కానున్నట్లు పేర్కొన్నాయి.శిల్పా శెట్టి దంపతులు రూ.60 కోట్ల మోసానికి పాల్పడినట్లు ముంబై వ్యాపారవేత్త దీపక్ కొఠారీ ఇటీవలే ముంబై పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తన కంపెనీ 2015 నుంచి 2023 వరకు రుణం, పెట్టుబడి రూపంలో రూ.60.4 కోట్లను ఈ దంపతులకు ఇచ్చిందని తెలిపారు. ఈ సొమ్మును వీరు తమ వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా తాను శిల్పా–రాజ్ దంపతులను కలిసినట్లు పిర్యాదులో పేర్కొన్నారు. ఆ సమయంలో వారు 'బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్' అనే హోమ్ షాపింగ్ కంపెనీలో డైరెక్టర్లుగా ఉన్నట్లు తెలిపారు.




ఈ కేసులోని బెస్ట్ డీల్ టీవీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రస్తుతం మూతపడింది.దీపక్ కొఠారీ ఫిర్యాదు ఆధారంగా ముంబై పోలీసులు ప్రాథమిక విచారణ నిర్వహించి, మోసం, నమ్మకద్రోహం తదితర సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మోసం మొత్తం రూ. 10 కోట్లకు పైగా ఉండటంతో, కేసును జుహు పోలీస్ స్టేషన్ నుంచి ఆర్థిక నేరాల విభాగానికి బదిలీ చేశారు. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. కేసు విచారణ సమయంలో దేశం విడిచిపోకుండా ఉండేందుకు శిల్పా దంపతులపై ఆర్థిక నేరాల విభాగం అధికారులు ఇటీవలే లుకౌట్ నోటీసులు కూడా జారీ చేసిన విషయం తెలిసిందే. అంతేకాదు రాజ్‌కుంద్రా, శిల్పా శెట్టిని అధికారులు విచారించారు కూడా.

## మమ్దానీ విజయంపై ట్రంప్ కామెంట్స్

: భారత సంతతికి చెందిన 34 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ను సవాల్ చేసి మరీ న్యూయార్క్ మేయర్ గా విజయం సాధించారు. దీనిపై తాజాగా ట్రంప్ స్పందించారు. విజయం అనంతరం మమ్దానీ చేసిన ప్రసంగం ఆవేశపూరితంగా ఉందని, ఈ కొత్త మేయర్ కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన వ్యక్తి అని విమర్శించారు. %న్యూయార్క్ నగరం కమ్యూనిస్ట్ క్యూబా, సోషలిస్ట్ వెనెజువెలా వలే మారుతుందని ట్రంప్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈ నగర ప్రజలు ఫ్లోరిడాకు పారిపోవాల్సి వస్తుందని హెచ్చరించారు. 2024, నవంబర్ 5న ఏర్పడిన తన ప్రభుత్వం పునరుద్ధరించిందని చెప్పారు. ఇప్పుడు న్యూయార్క్‌లో ఆ సార్వభౌమత్వాన్ని కొద్దిమేర కోల్పోయామని అన్నారు. అయితే తాము దానిని జాగ్రత్తగా



చూసుకుంటామని చెప్పారు. ఫ్లోరిడా రాష్ట్రంలోని మయామి నగరంలో నిర్వహించిన అమెరికా బిజినెస్ ఫోరంలో ట్రంప్ మాట్లాడారు.

## రాజేంద్రనగర్‌లో డ్రగ్స్ ఓవర్‌డోస్‌తో యువకుడు మృతి

హైదరాబాద్: మోతాదుకు మించి డ్రగ్స్ తీసుకోవడంతో యువకు మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్‌లో చోటుచేసుకున్నది. అహ్మద్ అలీ (28) అనే యువకుడు రాజేంద్రనగర్‌లోని శివరాంపల్లిలోని కెన్ వరత్ తన స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. మొబైల్ టెక్నీషిషన్ పనిచేస్తున్నాడు. రాత్రి స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడని, డ్రగ్స్ వోవర్ డోస్ కావడంతోనే మృతిచెందినట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



**సంపాదకీయం**

**శుక్రవారం 07-11-2025**

# ప్రాణాలు తోడేస్తున్నా పట్టదేం?

ప్లాస్టిక్‌ల వల్ల సంభవిస్తున్న అనారోగ్యాలు మరణాలు ప్రపంచానికి ఏటా 1.5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని లాన్సెట్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం ఇటీవల హెచ్చరించింది. ప్లాస్టిక్‌లలో క్యాన్సర్లు, అల్జీమర్స్, ఇతర వ్యాధులను కలిగించగల హానికర రసాయనాలు ఉంటాయి. వాటి వల్ల హృద్రోగాలు, పక్షవాతాల బారిన పడి ఏటా కొన్ని లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరాటంలో ప్రపంచ దేశాల వైఫల్యం కలవరపరుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఏటా 69శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు కేవలం 20 దేశాల నుంచే వస్తున్నాయి. ఒక్క అమెరికాయే తలసరిన ఏటా 130 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను వెలువరిస్తోంది. భారత్ విషయంలో అవి 0.12 కిలోలు. ప్రపంచవ్యాప్తంగా అరవై శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిలో పూడ్చిపెడుతున్నారు. కొంత శాతం వ్యర్థాలను తగలబెట్టినా మిగిలినవి పర్యావరణంలో కలిసిపోతున్నాయి. ఏటా ఎనభై లక్షల టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి చేరుతోంది. 2040కల్లా అది అంతకు నాలుగు రెట్లకు పెరుగుతుందన్న విశ్లేషణలు భయపెడుతున్నాయి. సూక్ష్మ ప్లాస్టిక్‌లు ఆహారం, నీరు, గాలి ద్వారా మానవ శరీరంలోకి చేరుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తి కర్బన ఉద్గారాలకు దారితీసి వాతావరణ మార్పులను కలిగిస్తోంది. 2030కల్లా బొగ్గు వల్ల కంటే ప్లాస్టిక్‌తోనే ఉద్గారాలు ఎక్కువగా వెలువడతాయన్న విశ్లేషణలు తక్షణం మేలుకోవాల్సిన ఆవశ్యకతను చాటుతున్నాయి.

ముడిపడని ఒప్పందం

ఈ ఏడాది ఆగస్టులో 184 దేశాలూ 400 అంతర్జాతీయ సంస్థలకు చెందిన 2,600 మంది ప్రతినిధులు జెనీవాలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో సమావేశమయ్యారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ వ్యర్థాల నిరోధక ఒప్పందం కోసం సమితి ఆధ్వర్యంలో జరిగిన అయిదో సమావేశం అది. ప్రపంచంలో ఏటా నలభై కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. 2040కల్లా అవి నాలుగింతలు పెరగనున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి జెనీవా సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారని అంతా ఆశించారు. కానీ, 11 రోజుల చర్చల తరవాతా ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ప్లాస్టిక్కులు, పాదరసం వంటి హానికర రసాయనాలను నియంత్రించాలని జెనీవా సభలో స్విట్జర్లాండ్, మెక్సికోలు సంయుక్తంగా చేసిన ప్రతిపాదనను వంద దేశాలు సమర్థించాయి. కానీ, చమురు ఉత్పత్తి దేశాలు వ్యతిరేకించాయి. అత్యధిక ప్లాస్టిక్కులు పెట్రోలియం నుంచే తయారవుతాయి. జెనీవా సభలో శిలాజ ఇంధన ఉత్పత్తి దేశాలు, రసాయనాల కంపెనీలకు చెందిన 234 మంది ప్రతినిధులు ప్లాస్టిక్ నిషేధానికి వ్యతిరేకంగా పైరవీలు చేశారు. వీరి సంఖ్య 27 దేశాల ఐరోపా సమాఖ్య ప్రతినిధులను మించిపోయింది. ఇలాంటి శక్తుల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతాయని ఐరాస మానవ హక్కుల సంస్థ మొదటి నుంచి హెచ్చరిస్తూనే ఉంది.పట్టు సడలింపులు, తూతూమంత్రం మార్పుచేర్పులతో బలహీన ఒప్పందం కుదుర్చుకోవడంకన్నా అసలు సంధి లేకపోవడమే మంచిదని పర్యావరణ బృందాలు వాదిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, ఈ దహన ప్రక్రియలో మరిన్ని హానికర రసాయనాలు వాతావరణంలో చేరిపోతాయని అవి హెచ్చరించాయి. దీనికన్నా ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగించడం మేలన్నాయి. అన్నింటినీ మించి ప్లాస్టిక్ ఉత్పత్తిపై పరిమితులు విధించి కచ్చితంగా అమలుచేయడం, నియంత్రణకు నిర్ణీత కాల పరిమితితో లక్ష్యాలను నిర్దేశించి వాటిని అందుకోవడం ఉత్తమమని సిఫార్సు చేశాయి. ధనిక దేశాలు తమ ప్లాస్టిక్ చెత్తను పేద దేశాలకు తరలించడాన్ని వ్యర్థాల వలసగా పర్యావరణ సంఘాలు అభివర్ణించాయి. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు పేద దేశాలకు అధునాతన టెక్నాలజీలను అందించాలని సిఫార్సు చేశాయి. ఇలాంటి జాగ్రత్తలతో ప్లాస్టిక్ వ్యర్థాలపై సర్వామోద ఒప్పందం కుదుర్చుకోవాలి.

భావితరాల మేలు కోసం...

ధనిక దేశాలు, చమురు ఉత్పత్తి దేశాలు కలిసిరాకపోతే ప్రగతిశీల, చిన్న ద్వీప దేశాలు విడిగా ఒప్పందం కుదుర్చుకుని ప్లాస్టిక్ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి. జెనీవా సభ విఫలమైనా, ప్రపంచ దేశాలు మళ్లీ ఈ అంశంపై సంప్రదింపులను పునరుద్ధరిస్తాయని ఆశిస్తున్నట్లు ఐరాస పర్యావరణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంగర్ యాండర్సన్ చెప్పారు. సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కూడా ఇదే ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని దేశాలు పారిస్ వాతావరణ సభ తీర్మానానికి కట్టుబడి శిలాజ ఇంధనాలను, ప్లాస్టిక్కులను కట్టడి చేయాలి. భావితరాల ప్రయోజనాలను కాపాడటానికి ఈ చర్యలు తప్పనిసరి అన్న అంతర్జాతీయ న్యాయస్థానం హితవును అందరూ ఆలకించాలి.

# పాక్‌ను ఎగదోసే పనిలో ట్రంప్ !



వాషింగ్టన్,ట్రంప్‌కు పిచ్చిపట్టిందని ఎవరైనా అనుకుంటే పొరపాటే..ఎందుకంటే ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు, ఆయన చర్యలు కేవలం భారత్‌ను టార్గెట్ చేసస్తున్నవిగా గుర్తించాలి. భారత్ ఆర్థికంగా ఎదగడం ఒక ఎత్తయితే..సైనికపాటవంలో అమెరికాను ధిక్కరించే స్థాయికి చేరుకుంటుందన్న భయం కూడా కనిపిస్తుంది. ముఖ్యంగా ఆపరేసన్ సిందూర్‌లో భారత్ సైనిక పాటవం అజేయంగా నిలిచింది. పాక్‌కు అమెరికా ఇచ్చిన యుద్ధవిమానాలను కూడా తుత్తినియలు చేసింది. ఇదే ప్రధాన కారణంగా ట్రంప్‌ను నిద్రలేకుండా చేస్తోంది. అందుకే ఇటీవల ఆయన తీసుకున్న నిర్ణయాలన్నీ భారత్‌ను ఏకాకిని చేయాలన్న బలమైన సంకల్పంతో తీసుకున్నవేనని గుర్తించాలి. అన్నింటికి మించి పాక్‌ను బూచిగా చూపి బెదిరించాలన్న ధోరణి బాగా కనిపి స్తోంది. ఇందులో భారత్‌తో సమానంగా పాక్‌ను కూడ చేర్చి రెండు అణ్వాయుధ దేశాలు అంటూ పదేపదే వ్యాఖ్యానించారు. ఇప్పుడు పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందన్నారు. దంతా కూడా పాక్‌లో పాగావేసి, అక్కడి నుంచి అవసరమైతే భారత్, చైనాలపై దాడులకు దిగాలన్న కుయక్తులు పన్ను తున్నారు. అందుకే భారత్ వ్యతిరేక చర్యలకు ట్రంప్ స్పీడ్ పెంచారు. సుంకాలు కావచ్చు.. వీసాలు కావచ్చు, అక్కడ అనధికారికంగా ఉన్నవారిని వేధించి, వెక్కరించి తిప్పిపంపడం కావచ్చు..ఉద్యోగాల్లో భారీతయులను తొలగించాలన్న డిమాండ్ కావచ్చు..ఇవన్నీ కూడా ఆపరేషన్ సింధూర్ తరవాత తీసుకున్న గట్టి నిర్ణయాలు గా చూడాలి. తాజాగా అణ్వాయుధ పరీక్షలు చేస్తామని చెప్పడం ద్వారా పాక్ కూడా అ÷-వాయుధాలు పరీక్షిస్తోందని చెప్పడం కూడా కేవలం భారత్‌ను బెదిరించే చర్య తప్ప మరోటి కాదు. ప్రపంచాన్ని 150 సార్లు నాశనం చేసే అణ్వాయుధాలు అమెరికా వద్ద ఉన్నాయని స్వయంగా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఆదివారం నాడు ఓ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇక నుండి అమెరికా అణ్వాయుధాలను పరీక్షిస్తుందని, చాలా దేశాలు అణు పరీక్షలు చేస్తున్నాయని అన్నారు. తమ వద్ద అత్యుత్తమమైన అణ్వాయుధాలున్నాయని, అయినా పెంచుకోవల్సిన అవసరం ఉందని అన్నారు. అవి ఎలా పని చేస్తున్నాయో పరీక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు. చైనా, రష్యా, ఉత్తర కొరియా దేశాల వద్ద కూడా అణ్వాయుధాలున్నాయని, కాని వారు బయటకు చెప్పరని అన్నారు. గత 30 సంవత్సరాల నుండి ఎటువంటి పరీక్షలు అమెరికా చేయలేదన్నారు. వారు అణు పరీక్షలు చేస్తునప్పుడు అమెరికా ఎందుకు చేయని దేశంగా ఉండాలని అన్నారు. ఆ దేశాలు రహస్యంగా భూగర్భంలో పరీక్షిస్తారు వాటి గురించి ప్రపంచానికి తెలియదని చెప్పుకొచ్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కేవలం పాక్ కూడా అణ్వాయుధ పరీక్షలు చేస్తోందని చెప్పడంలో మతలబు ఉంది. ఇకపోతే ఇదే సందర్భంలో పుతిన్, జిన్‌పింగ్ చాలా కఠినాత్ములు, బలమైన నాయకులు, తీవ్రంగా పరిగణించాల్సిన వ్యక్తులు అని వ్యాఖ్యానించారు. చైనాతో వాణిజ్య ఒప్పందం కుదిరింది కదా అని ఇంటర్వ్యూ చేస్తున్న జర్నలిస్టు ప్రశ్నించగా ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. 'మేము చైనాని ఓ కంట కనిపెడతాం. వారు అమెరికాను ఎల్లప్పుడూ కనిపెడ్తూ ఉంటారని అన్నారు. గత 8 నెలల కాలంలో 8 యుద్ధాలను ఆపానని, భారత్, పాక్‌ల మధ్య అణుయుద్ధాన్ని నివారించానని మరోసారి వ్యాఖ్యానించారు. ఇప్పటికే ట్రంప్ మీద స్వదేశంలో తీవ్రమైన వ్యతిరేకత వస్తోంది. విదేశాల్లో కుట్రలు చేస్తున్నారని, భారత్ లాంటి మిత్రదేశాన్ని దూరం చేసుకుంటున్నారని మండిపడు తున్నారు. ఇవేవీ ఆయన పట్టించుకోవడం లేదు. అంతెందుకు న్యూయార్క్ మేయర్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ట్రంప్ డెమొక్రాట్స్ సోషలిస్టు అభ్యర్థి జోహ్రాన్ మమ్దానిపై విమర్శలు చేశారు. అతను సోషలిస్టు కాదు, కమ్యూనిస్టు అని అన్నారు. 'మమ్దాని గెలిస్తే అధ్యక్షుడిగా నేనే నిధులు కేటాయించను. ఎందుకంటే న్యూయార్క్‌ను నడిపించేది కమ్యూనిస్టు అయినప్పుడు పంపించడం వృథా' అని అక్కసు వెళ్లగక్కారు. డెమొక్రాట్స్‌లో చెడ్డవారు, కమ్యూనిస్టులు ఉంటే నేను చెడ్డవారి పక్కనే నిలబడతానని మరో మేయర్ అభ్యర్థి క్యూమోను ఉద్దేశించి ట్రంప్ పేర్కొన్నారు. ఇలా రాజకీయంగా కూడా ట్రంప్ అమెరికాలో విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ సందర్భంగా పాకిస్తాన్ ఇదే అవకాశంగా అణ్వాయు ధాలపై వ్యాఖ్యలు చేసింది. రష్యా, చైనా, ఉత్తరకొరియా, పాకిస్థాన్ వంటి దేశాలు అణ్వాయు ధాలను పరీక్షిస్తున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇస్లామాబాద్ స్పందించింది. ఈ విషయంపై పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉన్నతాధికారి అంతర్జాతీయ మీడియాకు వివరణ ఇస్తూ.. తామెప్పుడు ఇతర దేశాల కంటే ముందుగా అణు పరీక్షలను పునరుద్ధరించబోమన్నారు. అణు పరీక్షలను నిర్వహించిన మొదటి దేశం పాక్ కాదని.. అదేవిధంగా అణు పరీక్షలను తిరిగి ప్రారంభించే మొదటి దేశంగానూ తాము ఉండబోమని స్పష్టం చేశారు. ఈ విషయంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి మావో నింగ్ సైతం స్పందించారు. బాధ్యతాయుతమైన అణ్వాయుధ దేశంగా చైనా ఎల్లప్పుడూ ఆత్మరక్షణ అణువ్యూహాన్ని సమర్థిస్తుందన్నారు. అణు పరీక్షలు నిలిపివేయాలనే విషయంలోనూ తాము అదే నిబద్ధతకు కట్టుబడి ఉంటామన్నారు. అమెరికా చేస్తున్న అణు పరీక్షలను సమర్థించుకున్న ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో చాలా దేశాలు చురుగ్గా అణ్వాయుధాలను పరీక్షిస్తున్నా యన్నారు. ఈ జాబితాలో పాకిస్థాన్ కూడా ఉందని పేర్కొన్నారు. అణ్వాయుధాలకు ఉన్న విధ్వంసకర శక్తి కారణంగా ఆ పరీక్షలు చేయకూడదని గతంలో అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయించుకున్నా. ఇప్పుడు పరిస్థితులు మారాయని ట్రంప్ అన్నారు. రష్యా, చైనా సహా ఇతర దేశాలు వేగంగా తమ అణుసామర్థ్యాలను పెంచుకుంటున్న నేపథ్యంలో మళ్లీ అణ్వాయుధ పరీక్షలు ప్రారంభించాల్సిందిగా అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. మొత్తంగా అమెరికా అణుపరీక్షల వ్యవహారం ఎలా ఉన్నా రష్యాచ,చైనాల సరసన పాక్‌ను కూడా చేర్చడం వెనక భారత్‌ను బెదరించే ధోరణిని ట్రంప్ ప్రకటించారు. ఎందుకంటే పాక్‌ను బల్లెంగా ఎగదోసే పనిలో ట్రంప్ బిజీగా ఉన్నాడని గుర్తించాలి. అందువల్ల ట్రంప్‌తో జాగ్రత్తగా ఉండాల్సిందే.

# కవిత టార్గెట్.. కారు పార్టీ.. టచ్‌లో ఆ నేతలు?

హైదరాబాద్,జాగృతి అధ్యక్షురాలు కవిత పార్టీ ఏర్పాటుపై పనులను స్పీడప్ చేసిందా? ఇప్పటి వరకు కవిత ఏం మాట్లాడినా కారు పార్టీలో ఓ అలజడి మొదలయ్యేది. కానీ ఇప్పుడా డోస్ పెంచారు కవిత. ఏకంగా బీఆర్‌ఎస్‌లో అసంతృప్తి నేతలను టార్గెట్ చేసేలా ఉన్నాయి ఆమె వ్యాఖ్యలు. అంతేకాదు ఇప్పటికే కవిత చేసిన వ్యాఖ్యలతో గులాబీ పార్టీలో గుబులు పెరిగిందట. ఇంతకీ కవిత పొలిటికల్ స్టెప్స్ ఎటు వైపు? అవి బీఆర్‌ఎస్‌పై ఎలాంటి ఇంపాక్ట్ చూపించబోతున్నాయి?

బీఆర్‌ఎస్ టార్గెట్‌గానే కవిత మాటలు:

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మాటలు ఏవైనా.. చేతలు ఏవైనా అవన్నీ బీఆర్‌ఎస్ టార్గెట్‌గానే ఉంటున్నాయనే టాక్ వినిపిస్తోంది. ఈ మధ్యకాలంలో మీడియా ముందుకు వచ్చిన ప్రతి సందర్భం సంచలనంగా మారుతుంది. ఎప్పుడు ఎవరి మీద ఏ ఆరోపణలు చేస్తుందో అన్న భయం నేతలను వెంటాడుతోంది. ముఖ్యంగా ఈ భయం బీఆర్‌ఎస్ నేతలకే ఎక్కువగా ఉంటుందట. ఎందుకంటే బీఆర్‌ఎస్ పార్టీలో జరుగుతున్న అంశాలు, నేతలపై ఆమె చేస్తున్న వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో దుమారం రేపుతున్నాయట.

బీఆర్‌ఎస్ కీలక నేతలు తనతో టచ్‌లో ఉన్నారన్న కవిత:

తాజాగా కవిత మరో బాంబు పేల్చింది. బీఆర్‌ఎస్ పార్టీలోని కీలక నేతలు తనతో టచ్‌లో ఉన్నారని చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. బీఅర్‌ఎస్ పార్టీలో చాలమంది నేతలు, ఉద్యమకారులు అసంతృప్తితో ఉన్నారని.. బీఆర్‌ఎస్‌ను వీడి జనంబాట పట్టాక అసంతృప్తి నేతలు నాతో టచ్ లోకి వచ్చారంటూ చేసిన కామెంట్స్ కారు పార్టీలో సంచలనంగా మారాయట. కవితతో టచ్‌లో ఆ నేతలు ఎవరు..? ఎందుకు బీఆర్‌ఎస్ పార్టీని వీడాలనుకుంటున్నారు..? ఎందుకు సంప్రదింపులు చేస్తున్నారు? అనేది ఇప్పుడు గులాబీ పార్టీలోనూ చర్చకు తెరలేపాయట.అంతేకాదు ఎక్కడ చాన్స్ దొరికినా బీఆర్‌ఎస్ పార్టీకి చురకలు అంటించడమే ఆమె పనిగా పెట్టుకున్నారు. అవినీతి చేశారు, అశ్రద్ధ చేశారు అంటూ విమర్శలు, ఆరోపణలు చేస్తూ స్పీచ్‌లు ఇస్తున్నారు కవిత. అది ప్రాజెక్ట్ అయినా.. రైతాంగ విధానమైనా.. ఇలా టాపిక్ ఏదైనా అందులో బీఆర్‌ఎస్‌ను టార్గెట్‌గా చేసుకోవడం ఇప్పుడు కామన్‌గా మారింది కవితకు.

సమయం వచ్చినప్పుడు చెబుతానన్న కవిత:

ఇటీవల కాలంలో బీఆర్‌ఎస్‌లో జరుగుతున్న పరిణామాలపైన కవిత స్పందిస్తూనే ఉన్నారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలను కవిత బయటకు చెబుతున్న పరిస్థితులున్నాయి. బీఆర్‌ఎస్ నేతల అసంతృప్తిగా ఉన్నారనే కామెంట్స్ చేయడం వెనక కవిత వ్యూహం ఏంటి అనేది చర్చనీయంశంగా మారింది. బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు టచ్ లో ఉన్నారని వ్యాఖ్యలు చేయడం ద్వారా%ొ% బీఆర్‌ఎస్ పార్టీని డీమోరల్ చేసేందకు మాట్లాడుతున్నారా? లేదా నిజంగానేనా నేతలు టచ్‌లో ఉన్నారా? అనే దానిపై పొలిటికల్ సర్కిల్స్‌లో జోరుగా చర్చ నడుస్తుందట. జనం బాట కార్యక్రమం కోసం జిల్లాల పర్యటనకు వస్తున్న తనకు కారు పార్టీలోని అసంతృప్తి నేతలు టచ్‌లోకి వస్తున్నారని త్వరలోనే లిస్టు చెబుతానని చెప్పడంతో గులాబీ పార్టీలో కలకలంగా మారుతుందట. కవితకు టచ్‌లోకి వెళ్లిన ఆ నేతలు ఎవరు అనేది ఆరా తీస్తున్నట్లు పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయట.

పార్టీని ఏర్పాటు చేయడంపై కవిత ఫోకస్:

కవిత పార్టీని ఏర్పాటు చేయడంపై కూడా ఫోకస్ చేశారు. పార్టీ పెడితే తమకు అవకాశం ఇవ్వాలని ముందస్తుగానే బీఆర్‌ఎస్ తోపాటు ఇతర పార్టీల నేతలు సైతం కవితతో సంప్రదింపులు చేస్తున్నట్లు సమాచారం. కొంతమంది నేరుగా



కలవడం, మరికొందరు ఫోన్ లు చేసి ఆశీర్వాదం కావాలని అడుగుతున్నట్లు సమాచారం. బీఆర్‌ఎస్ పార్టీ నేతలు సంప్రదిస్తున్నారని, వారి లిస్టు చెప్పాలంటే చేంతాడంతా ఉందని, అది సమయం వచ్చినప్పుడు చెబుతానని స్పష్టం చేస్తున్నారు కవిత. ఇంతకి ఆ లిస్టులో కీలక నాయకులు ఎవరనేది ఇప్పుడు హాట్ టాపిక్ అయింది. ఆ లిస్టులో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, మాజీ ప్రజాప్రతినిధులు సైతం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. కొంతమంది బీఆర్‌ఎస్ నుంచి ప్రస్తుతం ప్రజాప్రతినిధులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నవారు సైతం ఉన్నట్లు ప్రచారం ఊపందుకుందట.

ఓ స్పేస్‌ను క్రియేట్ చేసుకునే పనిలో కవిత:

అంతేకాదు కరెంట్ పాలిటిక్స్‌లో తనకంటూ ఓ స్పేస్‌ను క్రియేట్ చేసుకునే పనిలో ఉన్నారు కవిత. దీనికి తగ్గట్టుగానే ఆమె అడుగులు పడుతున్నట్టు కనిపిస్తోంది. రాష్ట్రంలో కచ్చితంగా రాజకీయ శూన్యత ఉందని%ొ% కొన్ని పార్టీలను నమ్ముకొని దగాపడ్డం అని ప్రజలు తనతో చెబుతున్నారంటున్నారు కవిత. తమ ప్రాధాన్యం ప్రజల సమస్యలు తీర్చటమే అని.. ప్రజల గొంతుకగా మారుతామంటున్నారు. అంతేకాదు జాగృతిని పొలిటికల్ పార్టీగా ఎస్టాబ్లిష్ చేసే పనిలో కూడా ఉన్నారు కవిత. జాగృతి రాజకీయ వేదికే అని.. తాము చాలా సందర్భాల్లో రాజకీయాలు మాట్లాడామని చెబుతున్నారు. తాము ప్రజలకోసమే పోరాడుతామని పదే పదే చెబుతున్నారు. అంతేకాదు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి తమ ప్రభావాన్ని చూపాలనే ఆలోచన కూడా ఉన్నట్టు కనిపిస్తోంది. లోకల్ బాడీ ఎన్నికల సమయంలోనే ఏం చేయాలన్నది నిర్ణయం తీసుకుంటామని.. ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయంటున్నారు కవిత.

వారి బాణం, వీరి బాణం అని అంటున్నారని..

తాను ఒంటరి పోరాటం చేస్తున్నాననే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కవిత బలంగా ప్రయత్నిస్తున్నట్టు కనిపిస్తోంది. తనను వారి బాణం, వీరి బాణం అని అంటున్నారని.. కానీ తాను తెలంగాణ ప్రజల బాణాన్ని అంటూ స్టేట్‌మెంట్స్ ఇవ్వడం ఇందులో భాగంగానే కనిపిస్తోంది. అంతేకాదు తనకు అన్యాయం జరగడం వలన పార్టీనుండి బయటికి రాలేదని.. అవమానం జరిగింది కాబట్టే అత్మగౌరవం కోసం బయటికి వచ్చానని చెప్పడం చూస్తుంటే.. ఆత్మగౌరవం అనే కాన్సెప్ట్‌తోనే ఆమె ప్రజల్లో మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపిస్తోంది. మొత్తానికి కవిత బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన తర్వాత బిజీ బిజీ అయ్యారు. తన భవిష్యత్ కార్యాచరణ చాలా స్ట్రాంగ్ గా ఉండాలని నిర్ణయించుకున్నట్లు ఆమె కామెంట్స్ ద్వారా తెలుస్తోంది. అందుకు అనుగుణంగా స్పష్టమైన రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి తన రాజకీయ భవిష్యత్‌పై రోడ్ మ్యాప్‌ను కవిత ప్రకటిస్తారనేది జాగృతి నేతల నుంచి వస్తున్న టాక్.

# జిల్లాల పునర్ వ్యవస్థీకరణ

అమరావతి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ పై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే మంత్రి అనగాని సత్యప్రసాద్ నేతృత్వంలో సచివాలయంలో జిల్లాల పునర్ వ్యవస్థీకరణపై మంత్రుల బృందం బుధవారం సమావేశమైంది. ఈ భేటీకి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్, నిమ్మల రామానాయుడు, బీసీ జనార్దన్ రెడ్డి, వంగలపూడి అనిత పాల్గొన్నారు. వర్చువల్‌గా మంత్రి నారాయణ, సత్య కుమార్ యాదవ్ ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ నేపథ్యంలో గత జగన్ ప్రభుత్వ హయాంలో అశాస్త్రీయంగా జరిగిన జిల్లాల విభజనను సరిదిద్దడంపై మంత్రులు మాట్లాడారు. జిల్లాల విభజన వల్ల ఉన్న ఇబ్బందులను తీరుస్తామని ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీ మేరకు జీవోఎం ఏర్పాటు చేసి కార్యాచరణ చేపట్టారు. ఇప్పటికే జీఎంవో ప్రాథమికంగా ఇచ్చిన నివేదికపై కొన్ని మార్గదర్శకాలు సీఎం చంద్రబాబు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలాలు, పంచాతీయలు విభజన చేయకుండా నియోజకవర్గమంతా ఒకే డివిజన్‌లో ఉండాలని ఇప్పటికే జీఎంవో నిర్ణయించింది. మంత్రుల బృందం సమావేశంలో చర్చించిన అంవాలతో తుది నివేదికను రూపొందించి సీఎం చంద్రబాబుకు మంత్రివర్గ ఉప సంఘం అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వం చేయబోయే జనగణనకు ముందే నివేదిక ఇచ్చేందుకు జీవోఎం ప్రయత్నిస్తోంది. ఈ నెల 10వ తేదీన జరిగే కేబినెట్ సమావేశంలో జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కీలక చర్చలు జరిపి మంత్రివర్గ ఉ ప సంఘం సిఫారసులకు ఆమోదం తెలిపే అవకాశాలు ఉన్నాయి.

# బిజెపిలో త్వరలోనే బిఆర్ఎస్ విలీనం

హైదరాబాద్, బీఆర్‌ఎస్ పార్టీని బీజేపీకి మాజీ సీఎం కేసీఆర్ తాకట్టు పెట్టారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు ఎనిమిది చోట్ల డిపాజిట్ కూడా రాకపోవడానికి కుమ్మక్కు రాజకీయాలే కారణమని విమర్శించారు. బిజెపిలో బిఆర్‌ఎస్ విలీనం ఎంతోదూరం లేదన్నారు. ఈ మేరకు ఈ రెండు పార్టీలు ఒక్కటే అంటూ బీఆర్‌ఎస్ బీజేపీ లపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధామంత్రి నరేంద్రమోదీకి మద్దతు ఇస్తున్న కేసీఆర్ తెలంగాణకి అత్యంత ప్రమాదకరమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కారు గుర్తుకు ఓటేస్తే కమలం గుర్తుకు వేసినట్లేనని ఆరోపించారు. జూబ్సీహిల్స్ క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ క్రమంలో సీఎంతో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం కోసం పనిచేస్తామని వారు హామీ ఇచ్చారు. అలాగే, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వారి సమస్యలపై సానుకూలంగా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. వారి సమస్యలని వెంటనే పరిష్కారిస్తానని మాటిచ్చారు. భారత్ జోడో పాదయాత్ర ద్వారా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశంలోని మైనార్టీలకు ఒక భరోసా ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్‌లో మైనార్టీలను మభ్యపెట్టడానికి కుట్ర జరుగుతోందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేసీఆర్ ఒక వైపు ఉన్నారని.. రాహుల్ గాంధీ, తాను మరోవైపు నిలబడ్డామని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కేందప్రభుత్వం ఎందుకు స్పందించలేదని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు. కార్ రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు తెలంగాణ గవర్నర్ ఇప్పటి వరకు ఎందుకు అనుమతి ఇవ్వలేదని నిలదీశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య రాజకీయ ఒప్పందం లేకపోతే ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఈ కేసుల విషయంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులను ఎందుకు విచారణకు పిలవడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనం అయ్యే పరిస్థితి ఉందని ఆరోపించారు. గతంలో కవితనే ఈ విషయాన్ని స్పష్టం చేసిందని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసేందుకు జూబ్లీహిల్స్‌ను ప్రయోగశాలగా చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ మంత్రివర్గంలో ఒక్క దళితుడే మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. తమ మంత్రివర్గంలో నలుగురు దళితులకు అవకాశం కల్పించామని ఉద్ఘాటించారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌కి అవకాశం ఇచ్చామని అన్నారు. అత్యంత నిరుపేదలకు సంక్షేమ కార్యక్రమాలు అందించాలన్నదే తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. దేశం కోసం సర్వం త్యాగం చేసిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీలని ఈడీ ఆఫీసుకు పిలిచి విచారణ చేశారని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. క్రైస్తవ సంఘాల ప్రతినిధులతో జరిగిన భేటీకి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యేలు లక్ష్మీకాంతరావు, శ్రీ గణెళిష్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఏఐసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు అనిల్ థామస్, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నాళ్లీ సంక్షోభం

వాషింగ్టన్, అమెరికా కాంగ్రెస్ నిధుల బిల్లును ఆమోదించకపోతే, ఫెడరల్ సేవలు నిలిచిపోవడం 'గవర్నమెంట్ షట్‌డౌన్'గా పిలుస్తారు. ప్రస్తుతం అదే జరుగుతోంది. నిధుల విడుదలపై పాలక రిపబ్లికన్లు, ప్రతిపక్ష డెమోక్రాట్ల మధ్య విభేదాలు మరింత ముదురడంతో కేంద్ర ప్రభుత్వ విభాగాలు స్తంభించాయి. 33 రోజులుగా అగ్రరాజ్యం అమెరికాలో షట్‌డౌన్ కొనసాగుతోంది. లక్షలాది ఉద్యోగులకు జీతభత్యాలు నిలిచిపోయాయి.

నిలిచిపోయిన సబ్సిడీలు..

ప్రస్తుత షట్‌డౌన్ పేద అమెరికన్లపై తీవ్ర ప్రభావం చూపుతోంది. దాదాపు 4 కోట్లకు పైగా ప్రజలకు లభించే ఆహార సబ్సిడీ కార్యక్రమాలు నిలిచిపోయే ప్రమాదం ఉంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రవేశపెట్టిన ఆరోగ్య సంరక్షణ పథకం "ఒబామా కేర్". దానికి కేటాయించిన ఫెడరల్ సబ్సిడీలు ఈ ఏడాది చివరతో ముగియనున్నాయి. వాటిని పొడిగించాలనే డెమోక్రాట్ల డిమాండ్‌ను రిపబ్లికన్లు తిరస్కరించడంతో ప్రతిష్ఠంభన ఇంకా కొనసాగుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదివారం ఒక టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "డెమోక్రాట్లతో ఒప్పందానికి వెళ్లే ప్రశ్నే లేదు. చివరకు వారే మమ్మల్ని సంప్రదిస్తారు" అంటూ తన దృక్పథాన్ని స్పష్టం చేశారు. ఆయన వ్యాఖ్యలతో ఈ సంక్షోభం త్వరగా ముగిసే అవకాశం కనిపించడం లేదు.

సెనెట్‌లో నంబర్ గేమ్..

100 సీట్ల సెనెట్‌లో నిధుల బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 60 ఓట్లు అవసరం. ప్రస్తుతం రిపబ్లికన్లకు 53 మంది, డెమోక్రాట్లకు 45 మంది సభ్యత్వం ఉంది. ఇద్దరు స్వతంత్ర సభ్యులు రిపబ్లికన్ వైపున ఉన్నా, చట్టం ఆమోదం పొందాలంటే కనీసం ఐదుగురు డెమోక్రాట్లు మద్దతు ఇవ్వాలి. కానీ ఒబామా కేర్‌కు సబ్సిడీలు కొనసాగించాలనే వారి షరతుతో ఒప్పందం కుదరడం కష్టతరం అవుతోంది.

## మార్పుకోసం..నవశకం కోసం ఈ ప్రస్థానం

న్యూయార్క్,అమెరికా స్థానిక ఎన్నికల్లో న్యూయార్క్ మేయర్ పదవిని డెమొక్రటిక్ పార్టీకి చెందిన జొహ్రాన్ మమ్దానీ సొంతం చేసుకున్నారు. ఆ స్థానాన్ని దక్కించుకున్న తొలి ఇండియన్-అమెరికన్ గా చరిత్ర సృష్టించారు. విజయానంతరం ఆయన మాట్లాడుతూ.. భారత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రస్తావన తీసుకువచ్చారు. మార్పు కోసం, నవ శకం కోసం ఈ రాత్రి తీర్పు వెల్లడైంది. జనవరి ఒకటిన నేను మేయర్‌గా ప్రమాణస్వీకారం చేస్తాను అని జొహ్రాన్ వెల్లడించారు. ఈ సందర్భంగా నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావించారు. నవశకం వైపు అడుగువేసినప్పుడు, ఒక శకం ముగిసినప్పుడు, సుదీర్ఘ అణచివేతకు గురైన జాతి నుంచి గళం వినిపించినప్పుడు.. చరిత్రలో ఇలాంటి క్షణాలు అరుదుగా వస్తాయి' అని తన విజయానికి ఆపాదించి మాట్లాడారు. ఈ విజయాన్ని కట్టబెట్టిన తన మద్దతుదారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యూయార్క్‌లోని కొత్తరాజకీయానికి థాంక్యూ. మేం మీకోసం పోరాడతాం.. ఎందుకంటే మేం మీలాంటివాళ్లమే. మన చేతుల్లోనే భవిష్యత్ ఉంది. రాజవంశాన్ని కూల్చివేశాం. ట్రంప్.. ఇదంతా మీరు చూస్తున్నారని నాకు తెలుసు. మీకు చెప్పడానికి నా వద్ద నాలుగు మాటలు ఉన్నాయి. సౌండ్ పెంచండి. మీరు మాలో ఎవరినైనా చేరుకోవాలంటే మా అందరినీ దాటాలని మమ్దానీ నేరుగా ట్రంప్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆయన అలా మాట్లాడుతుంటే.. ఇది ప్రారంభం పుతుంది అని ట్రూత్ సోషల్‌లో అధ్యక్షుడు రాసుకొచ్చారు. అలాగే రిచర్డ్ అనే ట్యాక్సీ డ్రైవర్‌తో కలిసి సిటీ హాల్‌లో వెలుపల 15 రోజులు నిరాహార దీక్ష చేసిన స్టోరీని వెల్లడించారు. ఇది మీ నగరం, ప్రజాస్వామ్యం మీది.. అని వ్యాఖ్యానించారు. అలాగే తన తల్లిదండ్రులకు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. నన్ను తీర్చిదిద్దింది మీరే. నేను మీ కుమారుడిని అయినందుకు గర్వంగా ఉందని అన్నారు. సోషలిస్ట్ భావజాలం ఉన్న మమ్దానీ న్యూయార్క్ మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై విజయం సాధించడం విశేషం. ఉగాండా జాతీయుడైన మహమూద్ మమ్దానీ-భారతీయ సినీ డైరెక్టర్ మీరానాయర్‌లకు జన్మించిన సంతానమే జొహ్రాన్. ఈ ఎన్నికను ట్రంప్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఆయనే స్వయంగా ప్రచారంలో పాల్గొన్నా కూడా ఫలితం లేకపోయింది. ఇక, అతిపిన్న వయస్సు (34 ఏళ్ల)లో న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన వ్యక్తిగా మమ్దానీ రికార్డ్ సృష్టించారు. విజయం తర్వాత మేయర్ ఆఫీస్ దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

## కిషన్ రెడ్డి ఇన్ !

హైదరాబాద్,జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రచారంలో హఠాత్తుగా బండి సంజయ్ సైడ్ తీసుకున్నారు. ఆయన స్థానంలో కిషన్ రెడ్డి వచ్చారు. ఇప్పుడు కిషన్ రెడ్డి రోజంతా ఉండి ప్రచారం చేస్తున్నారు.బండి సంజయ్ మాత్రం పెద్దగా కనిపించడం లేదు. మొదట్లో బండి సంజయ్ లీడ్ తీసుకున్నారు. ఆయన మజ్లిస్ .. కాంగ్రెస్ కు లింక్ పెట్టేసి తనదైన మార్క్ రాజకీయాలు చేయడంతో బీజేపీ పుంజుకుంటుందేమో అన్న అనుమానం చాలా మందికి వచ్చింది. కానీ అలాంటి అవకాశానికే తాము వ్యతిరేకం అని బీజేపీ హైకమాండ్ ఆయనను దూకుడు తగ్గించి ప్రచారానికి దూరంగా ఉండాలని సలహా ఇచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది.

బండి సంజయ్ దూకుడు తగ్గించేసిన పెద్దలు

బండి సంజయ్ బీజేపీ మార్క్ రాజకీయాల్లో దిట్ట. ముస్లింల ఓట్లు నిర్ణయాత్మకం అయిన జూబ్లీహిల్స్ లో ఆయన అడుగు పెట్టి లీడ్ తీసుకుంటే ఏం జరుగుతుందో చెప్పాల్సిన పని లేదు. బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నప్పుడే ఆయన మజ్లిస్ ను టార్గెట్ చేసిన వైనం చూసి రాజకీయ వర్గాలు షాక్ కు గురయ్యాయి. ఆ తర్వాత కూడా ఆయన అదే ధోరణి కొనసాగించారు. ముస్లిం మైనార్టీలపై బండి సంజయ్ వ్యాఖ్యలు హేట్ స్పీచ్ లాగానే ఉంటాయి. కానీ అదే బీజేపీకి బలం. మరో వర్గం మొత్తం ఆయన వెనుక వస్తుంది. జూబ్లీహిల్స్ లోనూ అదే మ్యాజిక్ చేసేందుకు బండి సంజయ్ రెడీ అయిన సమయంలో హఠాత్తుగా సైలెంట్ అయ్యారు.

మళ్లీ రంగంలోకి కిషన్ రెడ్డి

బండి సంజయ్ ను హఠాత్తుగా రేసు నుంచి తప్పించిన బీజేపీ హైకమాండ్.. మళ్లీ కిషన్ రెడ్డిని రంగంలోకి దింపింది. ఆయన రోజూ ప్రచారం చేస్తున్నారు. కానీ ప్రచారం జరుగుతుందో లేదో ఎవరికీ తెలియనంత గుంభనంగా ప్రచారం చేస్తున్నారు. కిషన్ రెడ్డి ఇచ్చే పొలిటికల్ స్టేట్మెంట్లు ఎవరికీ పట్టవు. పెద్దగా ఎవరూ పట్టించుకోరు. అందుకే బీజేపీ ప్రచారంలో చప్పుడు చేయడం లేదని ఎక్కువ మంది అనుకుంటున్నారు. బండి సంజయ్ ను హడావుడిగా పక్కన పెట్టి మళ్లీ కిషన్ రెడ్డిని ఎందుకు రంగంలోకి తెచ్చారన్నది ఎవరికీ అర్థం కాని విషయం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా ఇదే చేశారు. బండి సంజయ్ ను తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డిని పెట్టడంతోనే మొత్తం సీన్ మారిపోయింది. ఇప్పుడు జూబ్లిహిల్స్ ఉఎన్నికల్లోనూ అదే చేస్తున్నారు.

బీజేపీని ఎందుకు నియంత్రిస్తున్నారు?

బండి సంజయ్ తరహా దూకుడు ఇప్పుడే వద్దని బీజేపీ పెద్దలు అనుకుంటున్నారని అనుకోవచ్చు. లేదా బీఆర్ఎస్ పార్టీతో లోపాయికారీ ఒప్పందం ప్రకారం..బీజేపీని నార్మల్ గానే ఉంచాలని అనుకుంటున్నారని అనుకోవచ్చు. కానీ అది బీజేపీకి నష్టం చేయడమే అవుతుంది. బండి సంజయ్ ను ఎందుకు నియంత్రిస్తున్నారో కానీ..ఆయనను పట్టి ఉంచడం వల్ల బీజేపీనే ఎదగడం లేదని నేతలు మథన పడుతున్నారు. వివాదాస్పద అంశాలతోనే పార్టీని బలపర్చడంలో బండి సంజయ్ ది ప్రత్యేక పాత్ర. ఎప్పటికప్పుడు ఆయన లాక్కెళ్తుంటే.. స్పాయిలర్ లాగా కిషన్ రెడ్డిని పంపుతోంది హైకమాండ్. బండి సంజయ్ కృషి బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది.

## సంగారెడ్డి జిల్లా వద్ద అదుపుతప్పిన బస్సు

సంగారెడ్డి,రంగారెడ్డి జిల్లా చేవెళ్ల బస్సు ప్రమాదం ఘటన ఎంతటి విషాదాన్ని నింపిందో అందరికీ తెలిసిందే. బస్సును టిప్పర్ లారీ ఢీకొట్టడంతో అందులోని కంకర బస్సులో పడి దాదాపు 19 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన మరువక ముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. సంగారెడ్డి జిల్లాలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. అయితే ప్రాణాపాయం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బస్సులోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. జాతీయ రహదారి 65 సమీపంలో పటాన్‌చెరు మండలం ముత్తంగి వద్ద ఆర్టీసీ బస్సుకు ప్రమాదం జరిగింది. ముందు ఉన్న కారును తప్పించబోయి బ్రేక్ ఫెయిల్ కావడంతో బస్సు డివైడర్‌పైకి దూసుకెళ్లి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రయాణికులు ఎవరూ కూడా గాయపడకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గురైన బస్సు మేడ్చల్ డిపోకు చెందింది. మేడ్చల్ నుంచి ఇస్నాపూర్ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే పటాన్‌చెరు పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. బస్సులో సాంకేతిక లోపం కారణంగా ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

# పేదరిక నిర్మూలనలో కేరళ ఆదర్శం



కేరళ:సామాజిక, మానవ అభివృద్ధిలో రికార్డు సాధిస్తున్న 'దేవభూమి' కేరళ, తీవ్రమైన పేదరికం నుంచి విముక్తి పొందినట్టు 69వ రాష్ట్ర అవతరణ దినోత్సవం నవంబరు 1న రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించడం దేశానికే ఆదర్శాన్ని చాటుతోంది. తమ ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు రూ. 1000 కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు వెల్లడించారు. ఇదే సాఫల్యమైన కేరళ అసలు స్టోరీగా అభివర్ణించారు. అనేక రంగాల్లో కేరళ అభివృద్ధి సాధించడం ద్వారా 'కేరళ మోడల్' అన్న పేరు బాగా ప్రసిద్ధి చెందిందన్నది అందరికీ తెలుసు. ఇప్పుడు తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళ చరిత్ర సృష్టించింది. పినరయి విజయన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మదాం నియోజకవర్గం ఇప్పటికే దేశం లో, పేదరిక రహిత నియోజకవర్గంగా ప్రకటించబడడం గమనార్హం. పేదరిక కుటుంబాలను గుర్తించడంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. వివిధ ఏజెన్సీల సహకారంతో ప్రణాళిక రూపొందించింది. స్థానిక స్వపరిపాలన శాఖ నేతృత్వంలో సామాజిక భాగస్వామ్యానికి ప్రణాళికలో చోటు కల్పించింది. 2021 మేలో రాష్ట్ర ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అత్యంత పేదరిక నిర్మూలన కార్యక్రమం (ఎక్స్‌ట్రీమ్ పోవెర్టీ ఎరాడికేషన్ ప్రోగ్రామ్ ఇపిఇపి) ప్రారంభించింది. ప్రపంచ బ్యాంకు ఇటీవల సవరించిన అంతర్జాతీయ దారిద్ర్యరేఖ ప్రకారం రోజుకు మూడు అమెరికన్ డాలర్ల కంటే తక్కువ ఖర్చుతో జీవించే వ్యక్తులను తీవ్ర పేదరికంతో ఉన్నట్టు పరిగణిస్తారు. ఈ లెక్కన కేరళ ప్రభుత్వం ప్రజా కేంద్రీకృత అభివృద్ధి, వికేంద్రీకృత ప్రణాళికతో పేదరికాన్ని తగ్గించగలిగింది. 1973 74లో 59.8% వరకు ఉన్న పేదరికం 201112 నాటికి 11.3 శాతానికి తగ్గింది. నీతి ఆయోగ్ నేషనల్ మల్టీ డైమెన్షనల్ పోవెర్టీ ఇండెక్స్ 2023లో దేశం మొత్తం మీద అతి తక్కువ పేదరికం ఉన్న రాష్ట్రంగా సూచించింది. కేరళ జనాభాలో కేవలం 0.55 శాతం మంది మాత్రమే బహుముఖ పేదరికంలో ఉన్నారని స్పష్టం చేసింది. ఇది జాతీయ తలసరి పేదరికం 14.96% కన్నా చాలా తక్కువ. కేరళ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలను గుర్తించడంలో పూర్తిగా స్వీయ నమోదుపై ఆధారపడకుండా ప్రత్యేకంగా దాదాపు 4 లక్షల ఎన్యూమరేటర్లను నియమించింది. వీరికి స్థానిక పాలనా సంస్థలతోపాటు కుడుంబశ్రీ వర్కర్ల సహాయం కూడా అందించింది.అనేక స్థాయిల్లో మథింపు జరిగిన తరువాత 64,006 అతి పేద కుటుంబాలకు చెందిన 1,03,099 మంది పేదలను గుర్తించింది. వీరిలో చాలా మందికి కనీస ధ్రువీకరణ పత్రాలు లేవు. నాలుగు అంశాల ఆధారంగా వీరి పేదరికాన్ని గుర్తించారు. వారు తింటున్న ఆహారం, ఆరోగ్య ప్రమాణాలు, ఉండడానికి ఇల్లు ఉందా లేదా, వారి చదువు తదితర వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ కుటుంబాల్లో చాలా మందికి రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు కూడా లేవు. 21,263 కుటుంబాలకు రేషన్ కార్డులు ఇచ్చి రేషన్ అందేలా చేశారు. 4000 కుటుంబాలకు 5422 ఇళ్లు కట్టించి ఇచ్చారు. మరో 5522 ఇళ్లను తిరిగి నిర్మించారు. 1500 కుటుంబాలకు సాగుభూమి అందించారు. శిథిల స్థితిలో ఉన్న ఇళ్లల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు ఇళ్ల మరమ్మతుల కోసం రూ. 2 లక్షల వంతున సహాయం అందించారు. పేదరికం నుంచి ఒకసారి విముక్తి కల్పించడమంటే అన్ని సమస్యలు వారికి వెంటనే పరిష్కారమైనట్టు కాదు. పేదరికాన్ని ఎదుర్కోవడం ఎప్పటికీ అంతం కాని పని. రాష్ట్రప్రభుత్వం తీవ్ర పేదరిక నిర్మూలన ఆదర్శనీయమైన పద్ధతిలో కొనసాగించడంలో అసలు ఉద్దేశం కటిక పేదరికం మళ్లీ ఏర్పడకూడదని, కొత్తగా ఏ కుటుంబం పేదరికంలో పడకూడదని.. పేదరికం ఏ రూపంలో ఉన్నా నిర్మూలించడానికే ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కట్టుబడి ఉంది.విద్య, ఆరోగ్య రంగాల్లోనూ స్థానిక ప్రభుత్వాలు గట్టిగా కృషి చేస్తున్నాయి. 2025 నాటికి కేరళలో అక్షరాస్యత 96 శాతం చేరుకుంది. ఆరోగ్య భద్రత విషయాన్ని పరిశీలిస్తే రాష్ట్రంలో 5415 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మహిళల ప్రసూతి సమయంలో శిశుమరణాల సంఖ్య జాతీయ స్థాయిలో ప్రతివెయ్యి కాన్పులకి 28 వరకు ఉండగా, కేరళలో వెయ్యి కాన్పులకు 5 మాత్రమే ఉండటం గమనార్హం. మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలతో పోలిస్తే కేరళలో భారీ పరిశ్రమలు అంటూ లేవు. అయినా మానవాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి సూచికల్లో అగ్రగామిగానే కేరళ ఉంటోంది. పేదరిక నిర్మూలన నిరంతర కార్యక్రమమని, 2026 మార్చి నాటికి పేదరికం 0.002 శాతానికి చేరేలా ప్రయత్నిస్తామని రాష్ట్ర ప్రభుత్వం లక్షంగా పెట్టుకుంది.అయితే కేరళ నమూనాను విమర్శించేవారు కూడా ఉన్నారు. అభివృద్ధి విషయంలో స్తబ్ధత నెలకొందని, నిరుద్యోగం పెరుగుతోందని ఇది రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలకు సాక్షాలన్న విమర్శలు వస్తున్నాయి. పేదరిక నిర్మూలన గణాంకాలు ఉత్త బోగస్ అని కాంగ్రెస్ నేతృత్వం లోని విపక్షం ఆక్షేపిస్తోంది. ఈ విమర్శలను సవాలుగా తీసుకొని ప్రధాన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను, సాంకేతిక హరిత ఆధారిత పరిశ్రమలను నెలకొల్పడాన్ని ప్రభుత్వం వేగవంతం చేసింది. నిరుద్యోగాన్ని తొలగించడానికి విద్యావంతులకు నైపుణ్యాభివృద్ధిని చేపట్టింది. దేనికీ రాజీపడని ప్రగతిశీల పరిపాలన సంక్షేమాన్ని, అభివృద్ధిని ఈ రెండిటినీ సమతుల్యం చేసుకోగలదని 'ఇపిఇపి' నిరూపిస్తోంది. సమాజం నడిపించే ఈ నమూనా అట్టడుగు స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుంది. కేరళ స్టోరీ దేశం మొత్తంమీద ఆదర్శవంతమే కాక, విస్తృతంగా అనుసరించేలా ప్రచారం చేయదగిందనే చెప్పవచ్చు.

# ఆ ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సైడ్ చేశారా?

హైదరాబాద్, వాళ్లిద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు. పైగా ఒకే జిల్లాకు చెందిన వాళ్లు. సీఎం రేవంత్ సొంత ఇలాకా పాలమూరు ప్రజాప్రతినిధులు. సొంత సర్కార్ నిర్ణయాలు, సీఎం రేవంత్ డెసిషన్స్ మీద తమ అసంతృప్తి గళం వినిపిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే ఆ ఇద్దరు ఎమ్మెల్యేల తీరు పార్టీకి ఇబ్బందిగా మారిందట. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలపై పార్టీ ముఖ్యనేతలు కూడా గుర్రుగా ఉన్నారా? అందుకే ఆ ఇద్దరు శాసనసభ్యులను దూరం పెట్టాలనుకుంటున్నారా? హస్తం నేతలంతా జూబ్లీహిల్స్ ప్రచారంలో బిజీగా ఉన్నా..ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు క్యాంపెయిన్‌లో ఎందుకు కనిపించట్లేదు? ఇంతకు ఎవరా ఇద్దరు? అసలు పాలమూరు కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?

ఏడాదికి రూ. 25 కోట్లు ఇవ్వాలని డిమాండ్..

తెలంగాణ కాంగ్రెస్ లో ఆ ఇద్దరు ఎమ్మెల్యేల తీరే.. ఏడాదిగా హాట్ టాపికే. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తమదైన స్టైల్‌లో కామెంట్స్ చేస్తూ ఎప్పటికప్పుడు కొత్త చర్చకు తెరలేపుతున్నారు. ఈ ఇద్దరు సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా పాలమూరుకు చెందిన ప్రజాప్రతినిధులు. ఈ మధ్యే ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్‌తో కొత్త చర్చకు తెరలేపారు. ఎమ్మెల్యేలుగా ఎలక్ట్ అయిన ఈ 20 నెలల కాలంలో నియోజకవర్గంలో ఒక్క డెవలప్‌మెంట్ చేయలేకపోతున్నామని..నియోజకవర్గానికి ఏడాదికి రూ. 25 కోట్ల నిధులు ఇవ్వాలని..అప్పుడే ఎమ్మెల్యేలు గ్రామస్థాయిలో పనులన్నీ దగ్గరుండి చక్కబెట్టుకుంటారని వాయిస్ రేజ్ చేశారు యెన్నం.జూబ్లీహిల్స్ బైపోల్ ప్రచారంలో యెన్నం కామెంట్స్‌ను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్. పైగా గతంలోనూ కాంగ్రెస్ సర్కార్ విధానాలపై పేపర్‌లో ఓ ఆర్టికల్ రాసి చర్చకు తెరలేపారు యెన్నం. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అయితే పార్టీ ఎమ్మెల్యేలతో సీక్రెట్ మీటింగ్ పెట్టారంటూ ఆరు నెలల కింద పెద్ద చర్చే జరిగింది. సీఎం రేవంత్‌కు వ్యతిరేక వర్గాన్ని తయారు చేస్తున్నారన్న ప్రచారం అప్పటినుంచే ఊపందుకుంది. ఈ నేపథ్యంలో ఆ ఇద్దరు ఎమ్మెల్యేల తీరు కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్‌కు హెడెక్‌గా మారిందట. దీంతో అటు యెన్నం, ఇటు అనిరుధ్‌రెడ్డిని దారిలోకి తెచ్చుకునేందుకు ఏం చేయాలనేదానిపై కాంగ్రెస్ పెద్దలు తలలు పట్టుకుంటున్నారట.

ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా ఎమ్మెల్యే వైఖరి..

హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హొటల్‌లో మకాం పెట్టి..అసమ్మతి గళం వినిపిస్తున్నట్లు బయటకు వార్తలు రావడంతో సీఎం రేవంత్ అసంతృప్తికి గురయ్యారట. ఆ తర్వాత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా ఓ ప్రైవేట్ కంపెనీపై ల్యాండ్ విషయంలో హైకోర్టు మెట్లు ఎక్కడం..రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కార్నర్ చేస్తూ కామెంట్స్ చేయడం వంటివి రేవంత్‌కు కోపం తెప్పిస్తున్నాయట. ఆ తర్వాత హైదరాబాద్ సీపీగా అప్పట్లో ఉన్న సీవీ ఆనంద్‌పై అసెంబ్లీలో ప్రివిలేజ్ మోషన్ దాఖలు చేస్తామనడం ఇవన్నీ పార్టీకి



కాస్త ఇబ్బందికరంగా మారాయట.వీటన్నింటికి తోడు ఈ మధ్య మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఢిల్లీకి వెళ్లి..పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలవడం..ఆ తర్వాత వచ్చిన వార్తల విషయంలో సీఎంకు పట్టరాని కోపం వచ్చిందట. దాంతో వాళ్లిద్దరికి సమాచారం చేరేలా వార్నింగ్ పంపించినట్లు పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది. అంతేకాదు ఆ ఇద్దరు ఎమ్మెల్యే వ్యవహారంపై క్యాబినెట్ సమావేశంలో కూడా సీఎం గరం గరం అయినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.సొంత జిల్లా, సొంత సామాజికవర్గానికి చెందిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేల తీరుతో సీఎం కాస్త గుర్రుగా ఉన్నారట. అందుకే ఆ ఇద్దరిని దారిలోకి తెచ్చుకునేందుకు సీఎం రివర్స్ గేర్ వేస్తున్నారట. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ఈ ఇద్దరిని దూరంగా ఉంచారనే ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో కాంగ్రెస్ తరఫున గెలిచిన 12 మందిలో..యెన్నం, అనిరుధ్ మినహా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలతో సహా పది ఎమ్మెల్యేలంతా జూబ్లీహిల్స్ ప్రచారంలో బిజీగా ఉన్నారు. కానీ సీఎం సొంత జిల్లా పాలమూరుకు చెందిన యెన్నం, అనిరుధ్‌రెడ్డి మాత్రం ప్రచారంలో ఎక్కడా కనిపించడం లేదు.ఈ ఇద్దరికి అసలు జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎక్కడా..ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదన్న టాక్ వినిపిస్తోంది. ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అంతేకాదు పాలమూరు పాలిటిక్స్‌లో ఆ ఇద్దరిని సైడ్ చేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. వారికి ప్రయారిటీ ఇవ్వకుండా..నామ్ కే వాస్తే అన్నట్లుగా పేరుకే ఎమ్మెల్యేలు అన్నట్లుగా లైట్ తీసుకుంటున్నారట. పార్టీ ముఖ్యనేతలు కూడా ఈ ఇద్దరు ఎమ్మెల్యేల తీరుపై గుర్రు మీదున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. అయినా అటు యెన్నం, ఇటు అనిరుధ్ ఏమాత్రం తగ్గడం లేదట. దీంతో తనకు తలనొప్పిగా మారిన ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను ఎలా దారిలోకి తెచ్చుకోవాలనే దానిపై సీఎం రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారట. యెన్నం, అనిరుధ్ అసంతృప్తి చల్లారేదెప్పుడు.? ఆ ఇద్దరిని పార్టీ పక్కన పెట్టడం అయ్యే పనేనా? అనేది చూడాలి.

# వీఆర్‌లో ఉన్న పోలీసులకు జీతాలురావడం లేదు

అమరావతి,వీఆర్‌లో ఉన్న పోలీస్ అధికారులకు జీతాలు రావడం లేదని వైసీపీ ఎంపీ గురుమూర్తి ఆంధ్రప్రదేశ్ హై కోర్టులో పిల్ వేశారు. ఎంపీ గురుమూర్తి వేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఈ సందర్భంగా న్యాయస్థానం పలు ప్రశ్నలని ఎంపీకి సంధించింది. పోలీస్ సేవలను ఎక్కడ వినియోగించుకోవాలో పోలీసుశాఖకు బాగా తెలుసని చెప్పుకొచ్చింది. పోలీసులకు ఫలానా విధులని అప్పగించాలని తాము ఎలా ఆదేశించగలమని ధర్మాసనం ప్రశ్నించింది. జీతాలు రాకుంటే ఆ పోలీసులే నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చు కదా..? అని అడిగింది. పోలీసుల తరపున వైసీపీ ఎంపీ గురుమూర్తి ఎలా పిల్ దాఖలు చేస్తారని ప్రశ్నించింది. వీఆర్‌లో ఉన్న పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను లేవనెత్తుతూ పోలీస్ అధికారుల సంఘం లేదా జీతాలు అందని పోలీసులు ఎవరూ తమను ఆశ్రయించలేదని హైకోర్టు గుర్తు చేసింది. మార్గదర్శకాలు అమలు చేయకుంటే కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంబించే అధికారం తమకు లేదని పేర్కొంది ధర్మాసనం. అయితే, పేద, అణగారిన వర్గాల గొంతుకను వినిపించేందుకే పిల్ వేసినట్లు వైసీపీ ఎంపీ గురుమూర్తి హైకోర్టుకు తెలిపారు. పోలీసులు ఆ నిర్వచనం పరిధిలోకి రారని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు తగిన వేదికను ఆశ్రయించాలని పిటిషనర్‌కు సూచించింది. ఈ నేపథ్యంలో పిల్‌ను కొట్టివేసింది ధర్మాసనం. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

## దమ్ముంటే అభివృద్ధిపై చర్చిద్దాం

హైదరాబాద్, హైదరాబాద్ అభివృద్ధి పై తనతో చర్చకు రావాలని సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ సవాల్ విసిరారు. హైదరాబాద్ అభివృద్ధి ఎవరి హయాంలో ఏం జరిగిందో వివరిస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కౌంటర్ ఇచ్చారు. అసెంబ్లీ, సచివాలయం, గాంధీ భవన్ ఎక్కడైనా సరే.. రేవంత్‌తో చర్చకు రెడీ అని ఛాలెంజ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరాశ, నిస్పృహతో ఉన్నారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయమని రేవంత్‌కు అర్థమైందని సెటైర్లు గుప్పించారు. అందుకే తనపై రేవంత్‌రెడ్డి వ్యక్తిగత దూషణలకు దిగారని ధ్వజమెత్తారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమి తప్పదని భావించి.. రేవంత్‌రెడ్డి తనపై విమర్శలు చేస్తున్నారన్ని ÷ర్ అయ్యారు. ఆయన కంటే గట్టిగా తాను మాట్లాడగలనని... రేవంత్‌రెడ్డికి సమాధానం చెప్పే సత్తా తనకు ఉందని స్పష్టం చేశారు. కానీ తమ అధినేత కేసీఆర్ సూచనల తోనే రేవంత్‌రెడ్డిపై వ్యక్తిగత దూషణలకు తాను దిగటం లేదని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు చెప్పాలని కేసీఆర్ తనకు చెప్పారని పేర్కొన్నారు. తనను వ్యక్తిగతంగా విమర్శించిన.. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు కాబట్టి రేవంత్‌రెడ్డిని తాను గౌరవిస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ అభివృద్ధిపై రేవంత్‌రెడ్డి చర్చకు రావాలని సవాల్ విసిరారు. హోంశాఖను పర్యవేక్షిస్తున్న రేవంత్‌రెడ్డి హయాంలో శాంతి భద్రతలు క్షీణించాయని ఫైర్ అయ్యారు. హైదరాబాద్‌లో గన్, డ్రగ్ కల్చర్ పెరిగిందని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో హైదరాబాద్.. చెత్త సిటీ, క్రైం సిటీగా మారిందని విమర్శించారు. అండర్ పాస్‌లు, ఫ్లైఓవర్లు కేసీఆర్ హయాంలోనే నిర్మించామని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని ఫ్లై ఓవర్లు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో వంద లింకు రోడ్లు నిర్మించామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్లపై ఉన్న ఒక గుంత కూడా ఎందుకు పూడ్చలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. సీఎం అంటే కటింగ్ మాస్టర్ మాదిరిగా రేవంత్ వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్ సిటీలో మళ్లీ తాగునీటి కష్టాలు తెచ్చింది కాంగ్రెస్ సర్కార్‌నేనని విమర్శించారు. చెత్త సమస్య పరిష్కారానికి స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి తాము శ్రీకారం చుట్టామని నొక్కిచెప్పారు. మెట్రో నిర్మించిన ఎల్‌అండ్ టీని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించారని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో ఫ్లైల ఓవర్లు, అండర్‌పాసులు నిర్మించామన్నారు.

## చరిత్ర సృష్టించిన హైదరాబాదీ మహిళ..

హైదరాబాద్,వర్జీనియా స్టేట్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా భారత సంతతి మహిళా నేత గజాలా హష్మీ విజయం సాధించారు. ట్రంప్‌కు విధానాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన గజాలా.. వర్జీనియాకు తొలి మహిళా లెఫ్టినెంట్ గవర్నర్‌గా రికార్డు సృష్టించారు. రిచ్‌మండ్ స్టేట్ సెనెటర్‌గా ఉన్న గజాలా హష్మీ.. రిచ్‌మండ్ వర్సిటీలో ప్రొఫెసర్‌గా చేశారు. వర్జీనియా రేసులో గెలిచిన తర్వాత అమెరికాలో లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికైన తొలి భారత సంతతికి చెందిన ముస్లిం మహిళగా గజాలా హష్మీ చరిత్ర సృష్టించారు. ఆమె గర్భం దాల్చే హక్కులు, తుపాకి నియంత్రణ, విద్యపై దృష్టి పెట్టాలని యోచిస్తున్నారు.డెమొక్రాట్ గజాలా హష్మీ బుధవారం అమెరికాలో లెఫ్టినెంట్ గవర్నర్ అయిన మొదటి భారతీయ సంతతికి చెందిన ముస్లిం మహిళగా నిలిచారు. వాస్తవానికి, ఆమె వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్ రేసులో గెలిచినప్పుడు ఆ పదవికి ఎన్నికైన మొదటి ముస్లిం మహిళగా కూడా చరిత్ర సృష్టించారు.ప్రారంభం నుండే, ఆమె ప్రత్యర్థి, రేడియో షో హోస్ట్ అయిన రిపబ్లికన్ జాన్ రీడ్‌పై సునాయాసంగా విజయం సాధించారు. వర్జీనియా నుండి సెనేట్‌కు ఎన్నికైన మొదటి ముస్లిం మహిళ కూడా గజాలానే..ఆమె వెబ్‌సైట్ ఇలా పేర్కొంది: "గజాలా హష్మీ వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం.. మొదటి దక్షిణాసియా అమెరికన్." అమెరికాలో తుపాకీ హింసకు వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడటంతోపాటు.. అసాల్ట్ రైఫిల్స్‌పై నిషేధంతో సహా అటువంటి ఆయుధాలపై కఠినమైన నియమాలను కోరిన అమెరికన్ రాజకీయ నాయకులలో ఆమె ఒకరు.ఆమె ఇతర దృష్టి రంగాలలో ప్రభుత్వ విద్య, ఓటింగ్ హక్కులు, గర్భం దాల్చే స్వేచ్ఛ, పర్యావరణ అనుకూల పని, గృహనిర్మాణం, సరసమైన ఆరోగ్య సంరక్షణ సదుపాయంపై పనిచేయడం లాంటివి ఉన్నాయి.

గజాలా హష్మీది హైదరాబాదే

గజాలా జూలై 5, 1964న హైదరాబాద్ నగరంలోని మలక్‌పేటలో జన్మించారు. ఆమెకు నాలుగు సంవత్సరాల వయసులో ఆమె తల్లి, అన్నయ్యతో కలిసి అమెరికాకు వెళ్లారు. ఆమె తండ్రి అంతర్జాతీయ సంబంధాలలో పిహెచ్‌డి పూర్తి చేసి విశ్వవిద్యాలయ బోధనా వృత్తిని ప్రారంభించే సమయానికి అప్పటికే జార్జియాలో ఉన్నారు.తరువాత గజాలా జార్జియా సదరన్ యూనివర్సిటీ నుండి బి.ఎ. ఆనర్స్ డిగ్రీని, అట్లాంటాలోని ఎమోరీ యూనివర్సిటీ నుండి అమెరికన్ సాహిత్యంలో పి.హెచ్.డి.ని పొందారు.

గజాలా హష్మి: భర్త – పిల్లలు

గజాలా హష్మీ ముప్పై సంవత్సరాల క్రితం అజార్ రఫీక్‌ను వివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు %-% యాస్మిన్, నూర్. ఆమె తాత ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేశారు. ఆమె కుటుంబం ఇప్పటికీ హైదరాబాద్ నగరంలో ఉంది.. ఆమెకు వారితో చాలా అనుబంధం ఉందని ఎప్పుడూ చెబుతుంటారు.

గజాలా అగ్ర ప్రాధాన్యతలు

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా గజాలా అత్యంత ప్రాధాన్యత గర్భం దాల్చే స్వేచ్ఛ. ఆమె గర్భస్రావం హక్కు గర్భనిరోధకాలను పొందే హక్కును సమర్థిస్తున్నారు.ఆమె ప్రాధాన్యతలలో మరొకటి కఠినమైన తుపాకీ చట్టాలు.

## దుబాయ్‌లో కొనసాగుతున్న నారాయణ పర్యటన

అమరావతి,ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు విదేశాల్లో పర్యటిస్తున్నారు. ప్రముఖ సంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలను కలుస్తూ పెట్టుబడులకు ఏపీ అనువైన ప్రాంతమని చెబుతున్నారు. కొద్దిరోజుల క్రితం సీఎం చంద్రబాబు దుబాయ్‌లో, మంత్రి లోకేష్ ఆస్ట్రేలియాలో పర్యటించి ఇన్వెస్ట్‌మెంట్స్‌పై ఫోకస్ పెట్టారు. ఇప్పుడు తాజాగా మంత్రి నారాయణ బృందం దుబాయ్‌లో పర్యటిస్తోంది. రాష్ట్రానికి పెట్టుబడుల సాధన కోసం మూడు రోజులుగా దుబాయ్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన కొనసాగుతోంది.ఈరోజు (బుధవారం) బీఆ ఫెసిలిటీ, టెక్టాన్ ఇంజనీరింగ్, అరబ్ – ఇండియా స్పైసెస్ కంపెనీల ప్రతినిధులతో మంత్రి సమావేశంకానున్నారు. వేస్ట్ మేనేజ్మెంట్, రికవరీ ఎలాంట్‌లు, వైద్య రంగంలో ఫెసిలిటీ సంస్థ ప్రపంచ ప్రసిద్ధి పొందింది. విద్యుత్, ఆయిల్, గ్యాస్, వాటర్ ప్రాజెక్ట్స్ నిర్మాణంలో టెక్టాన్ ఇంజినీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్ కంపెనీ పేరుగాంచింది. ప్రపంచంలో ఆహార ధాన్యాల ఎగుమతిలో అరబ్ – ఇండియా స్పైసెస్ సంస్థ రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో ఆయా సంస్థల ఛైర్మన్‌లతో మంత్రి నారాయణ సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించనున్నారు. అనంతరం విదేశీ పర్యటనను ముగించుకుని రాత్రికి మంత్రి నారాయణ దుబాయ్ నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.

# సగం బీహార్ లెక్క తేల్చేస్తున్నారు !



పాట్నా:ఉత్తరాదిన హిందీ బెల్ట్ లో అతి పెద్ద రెండవ రాష్ట్రంగా బీహార్ ఉంది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు జరుగుతునాయి. తొలి దశకు రంగం సిద్ధం అయింది ఉదయం ఏడు గంటలకు పోలింగ్ స్టార్ట్ అయి సాయంత్రం ఆరు వరకూ జరగనుంది. మొత్తం 18 జిల్లాలు 121 అసెంబ్లీ నియోజకవర్గాలు తొలి దశలో ఉన్నాయి. నితీష్ కుమార్ ప్రభుత్వంలోని 16 మంది మంత్రులు తొలిదశ బరిలో ఉన్నారు. అంతే కాదు లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయ వారసుడు ఆర్జేడీ అగ్రనేత మహా ఘట్ బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ పోటీ చేస్తున్న నియోజకవర్గం తొలి దశలోనే ఉంది. సగానికి సగం అసెంబ్లీలో జరుగుతున్న మొదటి విడత పోలింగ్ తో బీహారీలు రాజకీయ పార్టీల జాతకాన్ని తేల్చేయనున్నారు. అంతే కాదు రేపటి కొత్త ప్రభుత్వం ఎవరిది ఏర్పడాలో కూడా డిసైడ్ చేయనున్నారు. ఏకంగా మూడున్నర కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కుని తొలి విడతలో వినియోగించుకో బోతున్నారు. నేతాశ్రీల నుదుట బలంగా తల రాత రాయబోతున్నారు.

భారీ పోటీతో :

బీహార్ లో ఈసారి భారీ పోరు నెలకొంది. ఎన్నడూ లేని విధంగా ఎన్డీయే మహా ఘట్ బంధన్ ల మధ్య హోరా హోరీగా ఫైట్ సాగుతోంది. కేవలం ఒక్క శాతం మాత్రమే తేడా ఉండడంతో రెండు పార్టీలు బలంగా ఢీ కొంటున్నాయి. అటు నుంచి ఇటు ఏ మాత్రం వేవ్ మారినా టోటల్ రిజల్ట్ లోనే తేడా వస్తుంది. అంత కీన్ కంటెస్ట్ గా బీహార్ పోరు ఉంది. ఎవరు విజేతలు ఎవరు పరాజితులు అన్నది తేల్చడానికి ఆఖరి సీటూ ఆఖరి ఓటూ కూడా పట్టి చూడాల్సిందే అని అంటున్నారు.

సర్వేలకు అందని వైనం :

సర్వేశ్వరులు సైతం బీహార్ ఫలితాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. బీహార్ ఎన్నికల్లో ఎవరు పవర్ అందుకుంటారు అన్నది చెప్పడానికి సెఫాలజిస్టుల పారామీటర్లు గత కాలం ట్రాక్ రికార్డులు కూడా ఏ మాత్రం సరి తూగడం లేదు, ఒక సర్వే మహా ఘట్ బంధన్ అంటే మరో సర్వే ఎన్ డీయే అంటోంది. సరి సమానంగా రాజకీయ వ్యూహాలు ఉన్నాయి. సామాజిక సమీకరణలు ఉన్నాయి. అలాగే అంగ బలం అర్థ బలం ఉన్నాయి. జాతీయ స్థాయిలో ఉన్న ఎన్ డీయే ఇండియా కూటములు సైతం సెమీ ఫైనల్స్ గా భావించి బీహార్ ని తమ రాజకీయ క్షేత్రంగా మార్చుకుంటున్నాయి.

మెజారిటీ సాధిస్తేనే :

తొలి విడత పోరులో ఏ కూటమి మెజారిటీ సీట్లు సాధిస్తుందో వారిదే అధికారం అన్న లెక్క కూడా ఉంది. దాంతో సర్వ శక్తులూ ఒడ్డుతున్నారు. ఇక్కడ కూడా ఫిఫ్టీ ఫిఫ్టీ అన్నట్లుగా తీర్పు ఉంటే అపుడు అసలైన పోటీ మలి విడతలో ఉంటుంది అని అంటున్నారు. నరేంద్ర మోడీ పొలిటికల్ గ్లామర్ తో పాటు అమిత్ షా ప్రత్యేక వ్యూహాల మధ్య కేంద్ర మంత్రుల వరస పర్యటన మధ్య నితీష్ కుమార్ మంచితనం సానుభూతి మధ్య ఎన్డీయే తన ప్రచారాన్ని జనాలకు చేరువ చేస్తోంది. రాహుల్ అండ్ ప్రియాంక విత్ సోనియా జాతీయ బలం తోడు రాగా కాంగ్రెస్ మద్దతు యువ నేత లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ అంతే స్థాయిలో వ్యూహాలను రచిస్తూ ఎన్డీయేను గట్టిగానే ఢీ కొడుతున్నారు. మొత్తానికి దేశం మొత్తం ఆసక్తిగా గమనించేలా బీహార్ ఎన్నికలు ఉన్నాయనడంలో సందేహం లేదు. నరాలు తెగే ఈ ఉత్కంఠ వీడాలీ అంటే ఈ నెల 14న ఫలితాల కోసం వేచి చూడక తప్పేట్లు అయితే లేదు.

# చిన్నమ్మ కీలక నిర్ణయంతో రెడీ !

అమరావతి,ఎన్టీఆర్ తనయ, ఆయన రాజకీయ వారసురాలు దగ్గుబాటి పురంధేశ్వరి. 2004లో ఆమె ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగు పెట్టారు. దాదాపుగా రెండు దశాబ్దాలకు పైగా పాలిటిక్స్ లో కంటిన్యూ అవుతున్నారు ఇక 2029లో ఆమె ఒక సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారు అని ప్రచారం అయితే పెద్ద ఎత్తున సాగుతోంది ఏమిటి ఆ నిర్ణయం అంటే సీరియస్ గానే అని అంటున్నారు. ఆమె ఇప్పటికి మూడు సార్లు ఎంపీగా పదవులు అందుకున్నారు. కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు. ఏపీలో బీజేపీ లాంటి జాతీయ పార్టీకి అధ్యక్షురాలిగా ఉన్నారు. ఆమె మంచి వాగ్ధాటితో మంచి సబ్జెక్ట్ తో మంచి పార్లమెంటేరియన్ గా గుర్తింపు పొందారు

ఇక చాలు అంటూ :

ఆమె భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఎన్టీఆర్ పెద్ద అల్లుడు. ఆయన 1982 నుంచి టీడీపీ స్థాపన లో ఉంటూ ఆ పార్టీలో ఎదిగి మూడు దశాబ్దాల పాటు రాజకీయ జీవితం చూశారు. ఎంపీగా రాష్ట్ర మంత్రిగా ఆయన పనిచేసారు. లోక్ సభ రాజ్యసభలలో కూడా ఆయన పనిచేశారు. ఆయన తన సతీమణిని రాజకీయాలోకి రావడాన్ని స్వాగతించారు. ఆ మీదట ఆయన తానుగా రాజకీయాల నుంచి రిటైర్ అయ్యారు. ఇపుడు పురంధేశ్వరి కూడా అదే విధంగా తాను కూడా ఇక చాలు అనుకుంటున్నారని టాక్ పెద్ద ఎత్తున సాగుతోంది.

దక్కని పదవి :

ఇక చూస్తే పురంధేశ్వరి 2014 నుంచి బీజేపీలో ఉన్నారు ఆమె పదేళ్ళ పాటు పార్టీలో పనిచేసి ఆ పార్టీ తరఫున పనిచేశారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలో ఏపీలో కూడా బీజేపీ భాగస్వామ్యంతో ప్రభుత్వాలు ఏర్పాటు అయ్యాయి. ఇక కేంద్రంలో మంత్రి పదవి ఆమెకు ఖాయమని అంతా అనుకున్నారు. కానీ చిత్రంగా ఆమెకు ఆ పదవి అందని పండు అయింది. మరే ఇతర పదవులు కూడా దక్కలేదు దాంతో ఆమె వర్గంలో ఒకింత అసంతృప్తి అయితే ఉంది అని అంటున్నారు. ఈ నేపథ్యంలో మిగిలిన మూడున్నరేళ్ల కాలాన్ని నెమ్మదిగా గడిపేసి 2029 ఎన్నికల ముందు రెస్ట్ తీసుకోవాలని అనుకుంటున్నారుట.



వారసుడు సిద్ధం :

ఇక దగ్గుబాటి దంపతులకు వారసుడిగా దగ్గుబాటి చెంచురాం హితేష్ ఉన్నారు ఆయనను 2029 ఎన్నికల్లో పోటీ చేయిని తాము తప్పుకోవాలని భావిస్తున్నారు అని అంటున్నారు. ఇప్పటికే హితేష్ పాలిటిక్స్ పట్ల ఆకర్షితుడు అయ్యారు ఆయన నిజానికి 2019లో వైసీపీ తరఫున పోటీ చేయాల్సి ఉంది. కానీ అలా జరగలేదు, కొన్ని సాంకేతిక అంశాల వల్ల దగ్గుబాటి వెంకటేశ్వరరావు పోటీ చేయాల్సి వచ్చింది దాంతో 2029 లో కచ్చితంగా పోటీకి దిగుతారు అని అంటున్నారు అది కూడా తెలుగుదేశం పార్టీ తరఫున అని అంటున్నారు అయితే ఎమ్మెల్యేగానా లేక ఎంపీగానా అన్నది తెలియడం లేదు, పైగా ఆయన తనకంటూ ఒక నియోజకవర్గాన్ని చూసుకోవడంలో ప్రస్తుతం ఉన్నారని అంటున్నారు. ఇక టీడీపీ హైకమాండ్ కూడా హితేష్ ని పార్టీలో తీసుకుని టికెట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారంలో ఏ మేరకు జరుగుతుందో.

# జూబ్లీహిల్స్ బైపోల్.. బీఆర్ఎస్-బీజేపీలకు నవంబర్ సెంటిమెంట్ మాటేంటి?

హైదరాబాద్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో బీఆర్ఎస్ కంగారు పడుతోందా? అధికార పార్టీ ప్రశ్నలకు కౌంటర్లు ఇవ్వలేక తర్జన భర్జన పడుతోందా? సీఎం రేవంత్ విసిరిన అస్త్రాలను రిప్లై ఇవ్వడానికే టైమ్ సరిపోతుందా? ఇది కచ్చితంగా నవంబర్ సెంటిమెంటేనని ఆ పార్టీ శ్రేణులు ఎందుకంటున్నారు? అందుకు బీఆర్ఎస్–బీజేపీలకు గ్రహాలు అనుకూలించలేదా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారానికి కేవలం నాలుగు రోజులు మాత్రమే ఉంది. ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన పార్టీలు రోజుకో అస్త్రాన్ని తెరపైకి తెస్తున్నాయి. వాటి చుట్టూనే ప్రధాన నేతల మాటలయుద్ధం కొనసాగుతోంది. గడిచిన రెండురోజులుగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో అదే జరిగింది. నేతల ప్రచారాన్ని గమనిస్తున్నవారు.. మునుపటి పోరాట పటిమ విపక్షాల్లో కనిపించలేదని అంటున్నారు.బీఆర్ఎస్–బీజేపీలను వెంటాడుతున్న సెంటిమెంట్ ఏంటి? బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రెండుచోట్లు ఉప ఎన్నికలు జరిగాయి. ఆ రెండింటిలోనూ ఆ పార్టీ ఓటమి పాలైంది. అప్పుడు బీజేపీ విజయం సాధించింది. ఎందుకంటే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఫైట్ చేసినప్పటికీ ఓటర్లను ఆకట్టుకోలేకపోయింది.

బీఆర్ఎస్–బీజేపీలకు సెంటిమెంట్

సరిగ్గా 2020 నవంబర్‌లో దుబ్బాక ఉప ఎన్నిక వచ్చింది. ఆ ఎన్నికల్లో అప్పటి అధికార బీఆర్ఎస్ ఓటమి పాలైంది.

బీజేపీ అభ్యర్థి విజయం సాధించారు. మరుసటి 2021 నవంబర్‌లో హుజూరాబాద్ ఉప ఎన్నిక వచ్చింది. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన ఈటెల, బీజేపీ నుంచి బరిలోకి దిగారు. ఈ ఎన్నికను అప్పటి ప్రభుత్వం పెద్దలు ఈ ఎన్నికను సీరియస్ గా తీసుకున్నారు. అయినా బీజేపీ ముందు ఆటలు సాగలేదు.ఆ ఎన్నికల్లో బీజేపీ గెలిచింది. బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి




వచ్చిన తర్వాత ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మంగా తీసుకుంది. అయినా ఓటమి తప్పలేదు. 2025 జూబ్లీహిల్స్ బైపోల్ ఎన్నికల కూడా నవంబర్‌లో జరుగుతోంది. ఇప్పుడు ఆ పార్టీ నేతలకు నవంబర్ సెంటిమెంట్ పట్టుకుంది. అధికారంలోకి ఉన్నప్పుడు గెలవలేదని, ఇప్పుడు కష్టమనే అభిప్రాయం ఆ పార్టీలో కొందరు నేతలు మాట్లాడుకుంటున్నారు.ఈ విషయం హైకమాండ్ చెవిలో పడింది. ఈ నేపథ్యంలో శ్రేణులు, నేతలకు దైర్యం నూరిపోయే ప్రయత్నం చేస్తోందట. ప్రతిపక్షంలో ఉంటే నవంబర్ కలిసి వస్తుందని, అప్పుడు బీజేపీకి అలాగే కలిసి వచ్చిందని చెబుతున్నారట. అప్పుడు పోటీ బీజేపీతో ఉండేదని, ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేస్తున్నారట కొందరు సీనియర్ నేతలు. ఇలాంటి సెంటిమెంట్‌ను పట్టించుకోవాల్సిన అవసరం లేదని అంటున్నారట.మరి బీజేపీకి నవంబర్ సెంటిమెంట్ కలిసి వస్తుందా? ఈసారి కష్టమేనని వాదన ఆ పార్టీ నేతల్లో లేకపోలేదు. సిటీలో జరిగే ఎన్నిక వేరు.. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ఎన్నిక వేరని అంటున్నారు. అప్పుడు కాంగ్రెస్ వీక్ ఉందని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అంటున్నారు. మరి పాత సెంటిమెంట్‌ని బీజేపీ రిపీట్ చేస్తుందా? లేదా అన్నది చూడాలి.

# అప్పట్లో దేవెగౌడ.. ఇప్పుడు జగన్.. సేమ్ టు సేమ్.. !



అమరావతి,అదేంటి అనుకుంటున్నారా? నిజమే. కొన్ని కొన్ని ఘటనలకు కార్యాకారణ సంబంధం ఉంటుంది. గతం లో దేశ ప్రధానిగా పనిచేసిన దేవెగౌడ గురించి పెద్ద ఎత్తున ఒక వాదన ప్రచారం జరిగింది. అది వాస్తవం కూడా. అయితే.. దానిని ఆయన సరిచేసుకునే ప్రయత్నం చేయలేకపోయారు. ఫలితంగా.. ఒక్కసారి ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయారు. తర్వాత.. అవకాశం తలుపు కాదు కదా.. వీధి వరకు కూడా రాలేదు. అచ్చంగా జగన్ పరిస్థితి కూడా ఇలానే ఉంటుందన్న జోరుగా సాగుతోంది.దేవెగౌడ విషయంలో ఏం జరిగిందో చూద్దాం.. కీలకమైన సమయంలో కాంగ్రెస్ పార్టీ పెద్దగా బలం పుంజు కోని సమయంలో దేవెగౌడ ప్రధాని అయ్యారు. నిజానికి ఆ సమయంలో ఆయన పుంజుకుని ఉంటే.. ప్రజలతో మార్కులు వేయించుకుని ఉంటే.. ఇక, దేశంలో ప్రత్యామ్నాయ ప్రధాన మంత్రిగా ఆయనే ఉండేవారు. కానీ, ఆయన చేసిన నిర్లక్ష్యం.. వేదికలపైనే నిద్రపోవడం.. ప్రజలను పలకరించేందుకు కూడా.. సమయం ఉండుదయ్యా అంటూ.. వ్యాఖ్యానించడం మైనస్ చేశాయి.ఫలితంగా జేడీఎస్ నాయకులు(సొంత పార్టీ) సైతం దేవెగౌడను పక్కన పెట్టారు. అనంతర కాలంలో ఆయ న కుమారుడు కుమారస్వామి పగ్గాలు చేపట్టే పరిస్థితి వచ్చింది. దీనంతటికీ కారణం.. దేవెగౌడ అధికారం లో ఉన్నప్పుడు వ్యవహరించిన సంగతులే. ఎవరు ఎన్ని చెప్పినా.. ఆయన మారలేదు. బహిరంగ సభల నుంచి కేబినెట్ సమావేశాల వరకు ఆయన నిద్ర పోయారు. ఇవి బాగా ప్రచారంలోకి వచ్చి.. ఏకంగా ఆయనను పక్కన పెట్టే పరిస్థితి వచ్చేసింది.ఇక, జగన్ విషయానికి వస్తే.. అధికారంలో ఉన్నప్పుడు.. తర్వాత.. గత 16 మాసాలుగా కూడా.. ఆయన వ్యవహరిస్తున్న తీరు.. ఏమాత్రం సానుభూతికి నోచుకోవడం లేదు. విపత్తులు వచ్చినా.. విధ్వంసాలు జరిగినా.. బటన్ నొక్కుతున్నాగా? అనే మాటే వినిపించేది. నేరుగా జగన్ బాధితులను పరామర్శించిన ఘటన ఒక్క ఎల్జీ పాలిమర్స్ ఘటన సందర్భంలోనే. ఆ తర్వాత.. కరోనా వచ్చినా..ఏలూరులో కలుషిత నీరు.. ప్రబావం చూపించినా.. ఆయన ఎక్కడా బయటకు రాలేదు. ఇప్పుడు కూడా ఆయన తాడేపల్లికే పరిమితం అవుతున్నారు. హద్దులు దాటిన నాయకులపై అప్పట్లో చర్యలు కూడా తీసుకోలేదు. ఈ పరిణామాలను గమనిస్తే.. జగన్ పరిస్థితి కూడా దేవెగౌడ మాదిరిగానే ఉందన్న వాదన బలంగా వినిపిస్తుండడం గమనార్హం.

### ఛత్తీస్‌ఘడ్‌లో మరో ఎన్‌కౌంటర్

ఖమ్మం,ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం, మారిమల్ల అడవుల్లో భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. ఆ ప్రాంతంలోని మావోయిస్టులను భద్రతా దళాలు చుట్టుముట్టినట్లు సమాచారం.

# చేవెళ్ల బాధితులను పరామర్శించే తీరిక లేదా?



హైదరాబాద్,కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం వెళ్లే ఘాట్ రోడ్డు లో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు లోయలో పడి 65 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటన తరువాత అప్పటి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు బాధితులను పరామర్శించలేదని బీజేపీ మొదలు కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు. సోమవారం నాడు చేవెళ్ల లో జరిగిన బస్సు–టిప్పర్ యాక్సిడెంట్ లో 19 మంది ప్రయాణీకులు ప్రాణాలు విడిచారు. ప్రమాద ఘటన జరిగిన రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి, బాధితులను పరామర్శిస్తారని స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆశించారు. మరునాడు అయినా రేవంత్ రెడ్డి బాధిత కుటుంబాలను ఓదార్చుతారని, రోడ్డు విస్తరణ పనులపై ప్రకటన చేస్తారని ఎదురు చూసి నిరాశపడ్డారు.జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి దేవాలయం ఘాట్ రోడ్డులో 2018 సెప్టెంబర్ 11వ తేదీన ఘోర బస్సు ప్రమాదం జరిగింది. దేవాలయం నుంచి ఘాట్ రోడ్డులో కిందికి వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లోయలో పడింది. బస్సులో 108 మంది ప్రయాణీకులు ఉండగా, 65 మంది చనిపోయారు. దేశ చరిత్రలోనే బస్సు ప్రమాదాలలో ఒకటిగా నిలిచింది. సిద్ధిపేట జిల్లా దుబ్బాకలో 2018 నవంబర్ లో జరిగిన బీజేపీ బహిరంగ సభలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా మాట్లాడుతూ, 65 మంది చనిపోతే పరామర్శించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కు సమయం లేదని విమర్శించారు. అక్కడెక్కడో పంజాబ్ లో రైతులు చనిపోతే చెక్కులు ఇస్తున్నారు, కొండగట్టులో భక్తులు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదని అప్పటి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ విమర్శించారు.పేదోళ్ల ఉసురు ఊరికే పోదని ఆయన దుమ్మెత్తిపోశారు. బాధితులను పూర్తి స్థాయిలో ఆదుకుంటే కేసీఆర్ కు పాలాభిషేకం చేస్తానన్నారు. కొండగట్టు బస్సు ప్రమాదం తరువాత అప్పటి మంత్రి టీ.హరీశ్ రావు ఎందుకు నోరు మెదపలేదని మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి ఇటీవలే ప్రశ్నించారు. కేసీఆర్ కూడా ప్రమాదం జరిగిన ఘాట్ రోడ్డు వద్దకు ఎందుకు వెళ్లలేదని ఆయన నిలదీశారు. బస్సు ప్రమాదంలో మరణించిన 65 మంది కుటుంబాల సభ్యులను పరామర్శించేందుకు కేసీఆర్ ఎందుకు వెళ్లలేదని టీజేఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్ కూడా ప్రశ్నించారు.

ఇప్పటికైనా బాధిత కుటుంబాలను పరామర్శించి, ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంతటి విషాద ఘటనపై కేసీఆర్ స్పందించకపోగా ఇతర రాష్ట్రాలలో రైతులకు చెక్కులు పంపిణీ చేస్తున్నారనే విమర్శలను ఎదుర్కొన్నారు.చేవెళ్ల బస్సు ప్రమాదం బాధితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శిస్తారని మంగళవారం సాయంత్రం వరకు ఎదురు చూశారు. బస్సులో ప్రయాణించిన వారిలో ఎక్కువగా వికారాబాద్ జిల్లా ప్రాంతానికి చెందిన వారే ఉన్నారు. దీంతో ఆయన తప్పకుండా వస్తారని, బాధితులను ఓదార్చుతారని కాంగ్రెస్ నాయకులు కూడా ఊహించారు. సోమవారం నాడు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద ఎస్.ఎల్.బీ.సీ టన్నెల్ పనులను పరిశీలించి సమీక్షించారు. మంగళవారం నాడు ఇతర కార్యక్రమాలతో పాటు నగరంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.ముఖ్యమంత్రి రాకపోయినా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, రంగారెడ్డి జిల్లా ఇన్ ఛార్జీ మంత్రి డీ.శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దుర్ఘటన జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. వీరితో పాటు మాజీ మంత్రి పీ.సబితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సందర్శించి, బాధితులను ఓదార్చారు. క్షతగాత్ర కుటుంబాల నుంచి ప్రతిఘటన, విమర్శలు ఎదురైనా, వారిని సముదాయించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు ఇచ్చిన విలువ, సమయం బస్సు ప్రమాదంలో చనిపోయిన 19 మంది కుటుంబాలకు రేవంత్ రెడ్డి ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పుడు కొండగట్టు ప్రమాద ప్రాంతాన్ని కేసీఆర్ సందర్శించలేదని, ఇప్పుడు చేవెళ్ల బస్సు దుర్ఘటన బాధితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరామర్శించలేదనే వ్యాఖ్యలు మొదలయ్యాయి.

# అనుకున్నది ఒక్కటి, అయిందొక్కటి..! ఎమ్మెల్యే గూడెంకు ఎంత కష్టమొచ్చే..!

హైదరాబాద్, ఒకప్పుడు ఆయన అధికార పార్టీ ఎమ్మెల్యే. బీఆర్ఎస్ హయాంలో ఆ నియోజకవర్గంలో ఆయన హవానే వేరు. ఆయన ఎంత చెప్తే అంత అన్నట్లుగా ఉండేది పరిస్థితి. కానీ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడింది. తాను గెలిచినా తన పవర్ తగ్గినట్లు అర్థమైంది. దీంతో ఆ ఎమ్మెల్యే కారు దిగి హస్తం గూటికి చేరిపోయారు. అయితే తాను అనుకున్నది ఒక్కటి ..అయిందొక్కటి అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అటు కాంగ్రెస్ నేతలు పిలవరు. ఇటు బీఆర్ఎస్ నేతలతో కలిసి పనిచేయలేరు. చివరకు తన నియోజకవర్గానికి మంత్రులు వచ్చినా ఎమ్మెల్యేకు ఇన్విటేషన్ ఉండట్లేదట. ఇంతకు ఎవరా ఎమ్మెల్యే? ఆయన కష్టాలకు కారణాలేంటి?

కొత్త కాంగ్రెస్ వర్సెస్ పాత కాంగ్రెస్..

పటాన్ చెరు నియోజకవర్గంలో ప్రొటోకాల్ రగడ నడుస్తోంది. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడంపై ఆయన ఆగ్రహంతో ఉన్నారట. అధికారిక కార్యక్రమమైనా..కాంగ్రెస్ పార్టీ ప్రోగ్రామ్ అయినా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని పట్టించుకునే వాళ్లే లేరట. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన గూడెం..కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కారు దిగి హస్తం గూటికి చేరారు. అయితే గూడెం చేరికపై పటాన్ చెరు లోకల్ లీడర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముందు నుంచి తమ నిరసన గళం వినిపిస్తున్నారు. అటు ఓటమి చెందిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుతోనూ బీఆర్ఎస్ లో ఉన్నప్పటి నుండే విబేధాలున్నాయి. దీంతో నియోజకవర్గంలో కొత్త కాంగ్రెస్ వర్సెస్ పాత కాంగ్రెస్ అన్నట్లుగా ఎమ్మెల్యే వర్గం, లోకల్ లీడర్లు చీలిపోయి రోడ్డెక్కి రచ్చ చేశారు. ఆ పంచాయితీ పార్టీ క్రమశిక్షణా కమిటీకి కూడా చేరింది. ఔట్ పుట్ ఏంటో ఇంకా తెలియదు కానీ.. పటాన్ చెరు కాంగ్రెస్ రచ్చ నడుస్తూనే ఉంది.అయితే స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే మంత్రులు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహంగా ఉన్నారట. ఇటీవల కొల్లూరులో డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయంలో రూ.10 కోట్లతో ప్రభుత్వ పాఠశాల భవనం నిర్మాణానికి వీఎస్టీ అనే సంస్థ సీఎస్ఆర్ ప్రాజెక్టు కింద ముందుకు వచ్చింది. ఈ విషయంపై అధికారులు ఎమ్మెల్యేకు సమాచారం ఇవ్వలేదట. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యవేక్షణలో హౌసింగ్, మున్సిపల్, రెవెన్యూశాఖల అధికారులతో కలిసి నిర్మాణ పనులపై సమావేశాలు పెట్టారట. కలెక్టర్ ప్రావీణ్య, హౌసింగ్ ఎండీ గౌతమ్ కొల్లూరులో పర్యటించి ఈ పనులకు మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని పెట్టుకున్నారు. ఆ సమయంలో కూడా అధికారులు ఎమ్మెల్యే గూడెంకు కనీస సమాచారం అందించలేదట.



ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యేకి నో ఇన్విటేషన్..

ఇక ప్రారంభోత్సవానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్, దామోదర్ రాజనర్సింహ వస్తున్నారంటూ అధికారులు ప్రకటించి ఆహ్వాన పత్రికలు పంచేశారు. ఇక చివరి క్షణంలో డీఈవో వెంకటేశ్వర్లు ద్వారా తనకు సమాచారం అందించారని ఎమ్మెల్యే గూడెం ఆగ్రహంతో ఉన్నట్లు సమాచారం. దీంతో మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ కు ఫోన్ చేసి అసహనం వ్యక్తం చేశారట ఎమ్మెల్యే. గతంలోనూ అమీన్ పూర్ మున్సిపల్ పరిధి కిష్టారెడ్డిపేటలో ఎక్సైజ్ కార్యాలయం శంకుస్థాపనకు మంత్రులు దామోదర్, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావును ఆహ్వానించగా ప్రొటోకాల్ పై ఎమ్మెల్యే ని లదీయడంతో అప్పటి కలెక్టర్ క్రాంతి కార్యక్రమాన్ని రద్దు చేశారు. సుల్తాన్ పూర్ మెడికల్ డివైజ్ పార్కు, రుద్రారం తోషిబా పరిశ్రమ ప్రారంభం వంటి సందర్భాల్లో కూడా ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులే చేస్తున్నారా? మంత్రులే ఎమ్మెల్యే అవసరం లేదంటున్నారా?

వరుసగా ప్రభుత్వ కార్యక్రమాలకు తనకు ఇన్విటేషన్ లేకపోవడంపై ఎమ్మెల్యే గుర్రుగానే ఉన్నారట. తన నియోజకవర్గంలో పనులపై తనకు ఏ సమాచారం లేకుండా అన్నీ అధికారులే నిర్వహిస్తూ చివరి క్షణంలో తనను రమ్మంటూ ఆహ్వానం పంపడంపై రుసరుసలాడుతున్నారట. ఇదంతా అధికారులే చేస్తున్నారా? లేదా వచ్చే మంత్రులే ఎమ్మెల్యే అవసరం లేదని చెపుతున్నారా? అధికారులపై లోకల్ లీడర్ల ప్రెజర్ ఏమైనా ఉందా? అన్నదానిపై క్లారిటీ వచ్చాక మీడియా ముందుకు వస్తానని గూడెం ఊగిపోతున్నారట. తనను ఇంతగా అవమానించడం ఏంటని అనుచరుల దగ్గర గూడెం బాధపడ్డట్లు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎమ్మెల్యేకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని, ప్రోటోకాల్ ప్రకారమే నడుచుకుంటున్నామని చెప్పుకొస్తున్నారు. ఏదేమైనా పటాన్ చెరులో ఎమ్మెల్యే ప్రోటోకాల్ రగడ చర్చనీయాంశంగా మారింది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com